



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## నేడు గుడివాడకు సీఎం

అమరావతి (చైతన్య రథం): సీఎం చంద్రబాబు శనివారం గుడివాడలో పర్యటించనున్నారు. ఎన్టీఆర్ గ్రౌండ్‌కు చేరుకుని ప్రజావేదిక సభలో ప్రసంగిస్తారు. కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం యలవర్తి గ్రౌండ్స్‌కు చేరుకుని గుడివాడ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

# అభివృద్ధికి రుణహస్తం

- నరసరావుపేటలో రూ.3,216 కోట్ల రుణాల పంపిణీ
- లక్షకుపైగా లబ్ధిదారులకు ప్రయోజనం
- 'క్రెడిట్ అవుట్ రీచ్'లో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి సీతారామన్
- బ్యాంకులు.. అభివృద్ధి భాగస్వాములన్న చంద్రబాబు
- రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకుల భాగస్వామ్యం కావాలని పిలుపు
- కూటమి వచ్చాక రుణాల రీ-షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా




పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వరంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్యాంకులు కేవలం రుణాలిచ్చే సంస్థలే కాదని, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములని సీఎం పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చిందని, కూటమి ప్రభుత్వం వాటిని రీ-షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేసిందని వివరించారు. డ్వాక్రా మహిళలు, పారిశ్రామికవేత్తలు సహా వేలాదిమందికి రుణాలతోపాటు అంబులెన్స్, వాహనాలు, సైకిళ్లు వంటి సదుపాయాలు కూడా అందజేశారు.

2





# దేశాభివృద్ధిలో రైల్వే కీలకం

- దక్షిణ భారతంలో నెం.1గా ఏపీని తీర్చిదిద్దుతాం
- మంగళగిరికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి
- అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేష్
- ప్రధాని చేతులమీదుగా ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్ వర్చువల్‌గా ప్రారంభం

6

రూ.12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్... రైల్వేలది దేశాభివృద్ధిలో కీలకపాత్ర అని, రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలని పేర్కొన్నారు. వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ భద్రతా సాంకేతికతతో దేశంలో అతిపెద్ద రైల్వే విప్లవం జరుగుతోందని ఉద్ఘాటించారు. అమరావతిని గ్లోబల్ సిటీగా, ఏపీని దక్షిణాదిలో నెం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని లోకేష్ ఉద్వేగపూరితంగా ప్రకటించారు.


# ఆక్వా, పొగాకు రైతుల భారం తగ్గించండి

- కేంద్రానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి -

- రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు కేంద్ర సహకారం కోరిన సీఎం
- మేధో మథన కేంద్రంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్
- రొయ్యల మేత ధరల స్థిరీకరణ, టారిఫ్ ఉపశమనంపై సీతారామన్‌తో చర్చ

4





# పోస్టుల భర్తీలో పారదర్శకం

- ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు
- అధ్యాపక పోస్టుల భర్తీపై విద్యా మంత్రి లోకేష్ ఆదేశం
- కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు వర్క్ ఫోర్స్ సిద్ధం చేయాలి
- ఐటిఐలను పరిశ్రమలతో అనుసంధానించి స్కిల్ గ్యాప్ భర్తీచేయండి
- ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో సవీక్షలో లోకేష్

5



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం. హాజరైన రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలు, మంత్రి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు. ఈనెల 20నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చర్చించాల్సిన అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు.

5

## 'ఎల్‌నినో'ను సమష్టిగా ఎదుర్కొందాం

- సహకరించాలని అన్నదాతలకు మంత్రి నిమ్మల పిలుపు

10

## ఏపీ సాంస్కృతిక వైభవ పునరుద్ధరణ

- ప్రతిపాదనలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- నెల రోజుల్లోనే సర్క్యులర్ జారీకి హామీ
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

9




# అభివృద్ధికి రుణహస్తం

## నరసరావుపేటలో రూ.3,216 కోట్ల రుణాల పంపిణీ



- లక్షకుపైగా లబ్ధిదారులకు ప్రయోజనం
- 'క్రెడిట్ అవుట్ రీచ్'లో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి సీతారామన్
- బ్యాంకులు.. అభివృద్ధి భాగస్వాములన్న చంద్రబాబు
- రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకుల భాగస్వామ్యం కావాలని పిలుపు
- కూటమి వచ్చాక రుణాల రీ-షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి

నరసరావుపేట (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ-షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వరంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేలమంది డ్వాక్రా మహిళలకు, 13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పల్నాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రమంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసానికి పాల్పడ్డారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రంనుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మారుస్తాం" అని సీఎం వివరించారు.

### నిర్మలా సీతారామన్ సంస్కరణల వాది

"మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్‌లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్‌లో నిర్మలా సీతారామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్‌లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని ఆరు జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే మూడు నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం" అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### చిన్న వ్యాపారులకు అండగా కేంద్రం: నిర్మలా సీతారామన్

దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని





గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు.

### ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీకి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు.


పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.





నరసరావుపేటలో రుణ వితరణ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మందికి రూ.3,216 కోట్ల రుణాలు చెక్కును అందజేసిన చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు.













# ఆక్వా, పొగాకు రైతుల భారం తగ్గించండి

## కేంద్రానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

- రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు కేంద్ర సహకారం కోరిన సీఎం
- మేధో మథన కేంద్రంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్
- రొయ్యల మేత ధరల స్థిరీకరణ, టారిఫ్ ఉపశమనంపై సీతారామన్‌తో చర్చ



అమరావతి (చైతన్య రథం): రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను స్థిరీకరించేందుకు కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. రొయ్యల మేతకు వినియోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగటం ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కారణంగా సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను కేంద్రమంత్రి దృష్టికి సీఎం తీసుకొచ్చారు. లక్షలాది మంది రైతులు, కార్మికులు, ప్రాసెసింగ్ కేంద్రాలు, ఎగుమతిదారులు, హేచరీలు, మేత తయారీదారులు, ఇతర అనుబంధ రంగాలకు ఆక్వా పరిశ్రమ ఉపాధి కల్పిస్తోందని సీఎం వివరించారు. మేత లభ్యతలో చిన్న అంతరాయం కూడా ఆక్వా రైతుల మనుగడ, ఎగుమతులపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతోందని తెలిపారు. రొయ్య మేత తయారీదారుల సంఘం చేసిన విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది జనవరి–ఏప్రిల్ మధ్య కాలంలో రొయ్య మేత ధరలు భారీగా పెరిగాయని, ఫలితంగా ఉత్పత్తి వ్యయం 20 శాతం కంటే ఎక్కువగా పెరిగిందని ముఖ్యమంత్రి వివరించారు. ఫిష్ మీల్ టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెరిగిందని, అలాగే చేప నూనె టన్ను రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు, సోయా లెసిథిన్ టన్నుకు రూ.68 వేల నుంచి రూ.1.10 లక్షలకు చేరిందన్నారు. రొయ్యల మేతకు సంబంధించి ఈ ముడిపదార్థాల భారం టన్నుకు రూ.25 వేల వరకూ పెరిగినట్టు సీఎం కేంద్రమంత్రికి వివరించారు. రొయ్యలు, ఆక్వాకల్చర్ ఉత్పత్తులకు సంబంధించి దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించటం, ఎఫ్‌పీఓల ఏర్పాటు, మార్కెట్‌తో ఆక్వా రైతుల అనుసంధానం, దేశీయ మార్కెట్లలో బ్రాండింగ్, ప్రాసెసింగ్, రీటైల్ ధరల ఏకీకరణకు మద్దతు ఇవ్వటంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ హెచ్చుతగ్గుల నుంచి ఈ రంగానికి రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. దీని కోసం ఓ సంస్థాగత ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఎన్‌ఎఫ్‌డీబీ ద్వారా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

### అమెరికా రెసిప్రోకల్ టారిఫ్‌పై సంప్రదింపులు జరపండి

రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలను తగ్గించేలా కేంద్రం సంప్రదింపులు జరపాలని సీఎం అభ్యర్థించారు. భారత్ నుంచి ఎగుమతి అవుతున్న రొయ్యలపై 5.77% కౌంటర్ వెయిలింగ్ డ్యూటీని అమెరికా విధించిందని అలాగే యాంటీ డంపింగ్ డ్యూటీ కూడా వేసేందుకు ఆలోచన చేస్తోందని సీఎం తెలిపారు. అమెరికా అధ్యక్షుడి రెసిప్రోకల్ టారిఫ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం అన్నారు. భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యల్లో 80 శాతం ఏపీ నుంచే వెళ్తున్నాయని, రెసిప్రోకల్ టారిఫ్ విధిస్తే రాష్ట్రంలోని 30 లక్షల మంది ఆక్వాకల్చర్ రంగంపై ఆధారపడిన వారి జీవనోపాధి దెబ్బ తినే ప్రమాదం ఉందన్నారు. అమెరికాకు చేసే రొయ్య ఎగుమతులను కాపాడేందుకు సీఫుడ్‌పై ప్రస్తుతం ఉన్న 30% కస్టమ్స్ సుంకాన్ని సున్నాకు తగ్గించాలని లేదా



రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దానిని మినహాయించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు అంతర్జాతీయంగా వివిధ ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఉన్న అవకాశాలను కేంద్రం గుర్తించాలని సీఎం కోరారు.

### పొగాకు ఉత్పత్తుల పన్ను భారం తగ్గించండి

వస్తు సేవల పన్ను అమల్లోకి వచ్చినప్పటి నుంచి పొగాకు ఉత్పత్తులను అత్యధిక పన్ను శ్లాబులో ఉంచటం పొగాకు రైతులపై నేరుగా ప్రభావం చూపిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం వివరించారు. సిగరెట్లపై భారీగా పెరిగిన ఎక్సైజ్ సుంకంపై జీఎస్టీని లెక్కించటం భారమైనట్టు పరిశ్రమ వర్గాలు ఆందోళన చేస్తున్నాయని అన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని తయారీదారులు కొనుగోళ్లను తగ్గించుకోవడంతో వేలం పాటల్లో పాల్గొనేవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో, గత సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది వేలం ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోందని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. తయారీదారుల కొనుగోళ్లు తగ్గించటంతో రైతు కూలీలు, వేలం కేంద్రాల కార్మికులు, రవాణాదారులు, ఎంఎస్ఎంఈ రంగాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని సీఎం తెలిపారు. ఈ ఏడాది 230 మిలియన్ కేజీల ఉత్పత్తికిగానూ కేవలం 34 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోళ్లు జరిగాయన్నారు. చట్టబద్ధమైన సిగరెట్లు, అక్రమ పొగాకు ఉత్పత్తుల మధ్య ధరల వ్యత్యాసం పెరగడం వల్ల, అక్రమ రవాణా పన్ను ఎగవేత కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. తక్షణం పొగాకు రైతులను ఆదుకునేలా నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

### హార్టీకల్చర్ హబ్‌కు సహకారం

రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ డెవలప్మెంట్ ప్లాన్‌కు కేంద్రం నుంచి పూర్తి సహకారం అవసరమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం స్పష్టం చేశారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, సత్యసాయి, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి సహా ప్రకాశం, మార్కాపురం జిల్లాలు ఉద్యాన ఉత్పత్తిలో 55 శాతం వాటాను కలిగి ఉన్నాయని సీఎం వివరించారు. 2030 నాటికి సాగు విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచటంతో పాటు ఉద్యాన ఉత్పత్తులను 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

201 ఉద్యానవన క్లస్టర్ల ద్వారా రూ.14,906 కోట్ల పెట్టుబడి ద్వారా 9 లక్షల మంది రైతులకు లబ్ధి కలుగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో నీటి భద్రత కోసం రూ.20,884 కోట్ల వ్యయంతో 23 సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉందని, తద్వారా 9 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు, 4.3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. రూ.4,562 కోట్ల వ్యయంతో 5,721 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల ఆధునీకరణ చేపట్టి వివిధ ప్రాంతాలను అనుసంధానించాల్సి ఉందని ముఖ్యమంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల కనెక్టివిటీ ద్వారా రైతులకు మార్కెట్ సౌకర్యంతో పాటు రవాణా ఖర్చులు తగ్గుతాయని అన్నారు. ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్లు, ప్రైవేటు రంగం ద్వారా రూ.60 వేల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని వివరించారు. ఈ పెట్టుబడితో ఏటా రూ.81 వేల కోట్ల జీవీఏ సాధించే అవకాశం ఉంటుందని, 19.7 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. వ్యవసాయంలో ఆధునిక పరికరాల ద్వారా దిగుబడిలో 10 శాతం వృద్ధి సాధించటంతో పాటు కోత అనంతర నష్టాలను 45 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను చేరుకోవాలన్నదే ఈ ప్రణాళిక లక్ష్యమని సీఎం వివరించారు. ఆగస్టు 6–7 తేదీల్లో హార్టీకల్చర్ హబ్ పనులు ప్రారంభించనున్నామని, ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం కేంద్ర మంత్రిని ఆహ్వానించారు.

### ఆవిష్కరణల కేంద్రంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

రాయలసీమ సమగ్ర ఉద్యానవన అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ప్రతిపాదించామని సీఎం కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఐఎసఏను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వ్యవసాయ ఆవిష్కరణల్లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఇది పనిచేస్తుందని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో ఏఐ, డిజిటల్ అగ్రికల్చర్, వాతావరణ సుస్థిరత లాంటి అంశాలపై దృష్టి సారించేలా ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

క్లైమేట్–స్మార్ట్ అగ్రికల్చర్, డిజిటల్ ఫార్మింగ్, పోస్ట్–హార్వెస్ట్ సిస్టమ్స్, గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేలా ఐఎసఏ పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, అగ్రిటెక్ లాంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఈ సంస్థ కీలకంగా పనిచేస్తుందని సీఎం తెలిపారు. రిలయన్స్ గ్రూప్ యాంకర్ భాగస్వామిగా స్టార్టప్, ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. జాన్ డీర్, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఎన్విడియా, నెస్లే, కార్గిల్ లాంటి అంతర్జాతీయ కంపెనీల నుంచి పరిశోధనా సహకారాన్ని కూడా తీసుకోనున్నట్టు సీఎం తెలిపారు. ఎంబీఏ అగ్రికల్చర్ లీడర్షిప్, డిజిటల్ అగ్రికల్చర్‌లో మాస్టర్స్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ లాంటి ప్రపంచ స్థాయి కోర్సులను అందించేలా దీనిని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆగస్టు 3 తేదీన రిలయన్స్ గ్రూప్‌తో ఐఎసఏ ఏర్పాటుపై ఎంఓయూ కుదుర్చుకోనున్నామని, సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమిని కూడా గుర్తించినట్టు సీఎం తెలిపారు. విద్యా బోధనతో పాటు ఏపీ అగ్రికల్చరల్ ట్రాన్సఫర్మేషన్‌కు ఓ మేధోమథన కేంద్రంగా, ఆవిష్కరణలకు ఇంజిన్‌గా ఐఎసఏ పనిచేస్తుందని సీఎం తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక సంస్థ ఏర్పాటులో తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు.





# తెదేపా ఎంపీలతో సీఎం భేటీ






అమరావతి (చైతన్య రథం): తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ భేటీ జరిగింది. ఈనెల 20నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలతో సీఎం చర్చించారు. వివిధ అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, కేంద్రంనుంచి రావాల్సిన నిధులు, నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలు, రాజధాని నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణపై చంద్రబాబు సూచనలు చేశారు. రాయలసీమకు సాగునీటిని అందించేందుకు చేపట్టాల్సిన గోదావరి–పెన్నా అనుసంధాన ప్రక్రియ, కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం చేశారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, రైల్వే భూముల కేటాయింపు, జోన్ పూర్తిస్థాయి కార్యకలాపాల ప్రారంభం అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టే వివిధ చట్ట సవరణలు, కొత్త బిల్లులపట్ల పార్టీ అనుసరించాల్సిన విధానంపై సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు, ఎస్ఐఆర్ అంశాలపై నేతలతో సీఎం చర్చించారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారం, ఫేక్ న్యూస్ కట్టడి, వ్యవస్థలపై జరుగుతున్న దాడుల అంశాల్లో పార్లమెంట్ వేదికగా లేవనెత్తే విషయంపై చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఎంపీలు తమ నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు.

# పోస్టుల భర్తీలో పారదర్శకం

- ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు
- అధ్యాపక పోస్టుల భర్తీపై విద్యా మంత్రి లోకేష్ ఆదేశం
- కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు వర్క్ ఫోర్స్ సిద్ధం చేయాలి
- ఐటిఐలను పరిశ్రమలతో అనుసంధానించి స్కిల్ గ్యాప్ భర్తీచేయండి
- ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్షలో లోకేష్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఫ్యాకల్టీ భర్తీ ప్రక్రియలో విశ్వవిద్యాలయాలు, వైస్ చాన్సలర్లు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... "అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి. భర్తీ ప్రక్రియలో ఎటువంటి ఉల్లంఘనలు, ఆరోపణలు తలెత్తినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల పరిధిలో అధ్యాపక పోస్టుల కోసం 1,90,509 అప్లికేషన్లు రాగా, వాటిలో 1,51,836 దరఖాస్తులు అర్హమైనవిగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఎలిజిబిలిటీకి సంబంధించి గ్రీవెన్స్‌ను ఈనెల 21 వరకు స్వీకరించి, 27న అర్హుల తుదిజాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఇంటర్వ్యూ ప్రక్రియను సైతం పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా చూడాలి, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ప్రైవేటు యూనివర్సిటీల అనుమతులకు సంబంధించి విధివిధానాలు, వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెట్ల నిర్వహణ పురోగతిపై చర్చిస్తూ... సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రైవేటు వర్సిటీలకు అనుమతులు ఇచ్చే సమయంలో యుజిసి నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టంచేశారు.

## జాబ్ మేళాల ద్వారా 1.37లక్షలమందికి ఉద్యోగాలు

స్కిల్ డెవలప్‌మెంట్ శాఖను మంత్రి సమీక్షిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.37లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. యువతకు మరింత సౌలభ్యంగా ఉండేలా జాబ్ మేళాలను నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఐటిఐని పరిశ్రమలకు అనుసంధానించి, యువత నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన వర్క్ ఫోర్స్ తయారు, స్కిల్ గ్యాప్ భర్తీపై నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించి 81 ఆపరేషనలైజ్ ఇండస్ట్రీ అకడమిషియా పార్టనర్ షిప్స్‌ను సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాకేంద్రాల్లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యాన రూ.94కోట్లతో ట్రైనింగ్ సెంటర్ల నిర్మాణానికి డిజైన్లు సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్‌ను యువతకు ఉపయోగకరంగా తీర్చిదిద్ది, వచ్చేనెలలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా మొదటి సంవత్సరం నుంచే వివిధ ఉద్యోగాలు, వాటికి కావాల్సిన స్కిల్స్ సమాచారం, కెరీర్ గైడెన్స్ వివరాలతో నైపుణ్యం పోర్టల్ ద్వారా అప్ డేట్స్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కిల్స్‌పై అవగాహన కల్పించడమేగాక ఆన్ లైన్‌లో స్కిల్ పాస్ పోర్టు అందిస్తామని తెలిపారు. కళాశాల నుంచి చదువు పూర్తిచేసుకుని బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్ లభించేలా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్లేస్‌మెంట్ సెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫలితాల సాధనే అంతిమ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ సిఇఓ గణేష్ కుమార్, సీడాప్ సిఇఓ నారాయణస్వామి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

చైతన్యరథం



# దేశాభివృద్ధిలో రైల్వే కీలకం

- దక్షిణ భారతంలో నెం.1గా ఏపీని తీర్చిదిద్దుతాం
- మంగళగిరికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి
- అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేష్
- ప్రధాని చేతులమీదుగా ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్ వర్చువల్‌గా ప్రారంభం



## దక్షిణ భారతదేశంలో నెం.1 రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం

"రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలి. ఈరోజు పెద్దఎత్తున మనం ప్రజారాజధాని అమరావతిని అభివృద్ధి చేసుకుంటున్నాం. అమరావతిలో కేవలం భవనాలు నిర్మించడమే కాదు.. ఎయిర్, రోడ్డు కనెక్టివిటీ, రైలు కనెక్టివిటీ అనేది చాలా ముఖ్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మూడింటినీ అనుసంధానం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్ వర్క్ ఏర్పాటుచేసే దిశగా ముందుకు వెళ్తున్నారు. 2019 నుంచి 2024 వరకు అభివృద్ధి నిలిచిపోయింది. అమరావతి పనులు నిలిపివేశారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి పెద్దఎత్తున అమరావతి పనులు పరిగెత్తిస్తున్నారు. అమరావతిని గ్లోబల్ సిటీగా తయారుచేయాలనేది మనందరి లక్ష్యం. 60 ఏళ్లు చెమటోడ్చి హైదరాబాద్‌ను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకున్నాం. అలాంటిది 2014లో కట్టుబట్టలతో మెడపట్టి బయటకు గెంటేశారు. ఈరోజు హైదరాబాద్‌ను చూసి అసూయ పడుతున్నా. ఆ అసూయ నాలో కసి పెంచింది. ఏపీని కూడా దక్షిణ భారతదేశంలో నెం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని లోకేష్ ఉద్వేగపూరితంగా ప్రకటించారు.



మంగళగిరి (చైతన్య రథం): దేశాభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర అని, రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రూ.12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... "దేశంలో అనేక సంస్థలున్నాయి. కాని ఒక సంస్థ మొత్తం భారతదేశాన్ని కలుపుతోంది. అదే మన రైల్వే సంస్థ. మన జీవిత ప్రయాణంలో ఎప్పుడో ఒకప్పుడు రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై వేచి చూసి ఉంటారు. రైలు కిటికీలోంచి బయటకు చూసి ఉంటారు లేదా భారతీయ రైల్వేలో ఒక ముఖ్యమైన ప్రయాణం చేసి ఉంటారు. అందుకే భారతీయ రైల్వే కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, అది భారతదేశ జాతీయ సమైక్యత, సమగ్రతకు గొప్ప సాధనం. దేశాభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ రైల్వే వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు" అని పేర్కొన్నారు.

### రైల్వేల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

"గతంలో దశాబ్దాల తరబడి భారతీయ రైల్వేలు రద్దీగా ఉండే స్టేషన్లు, ఆలస్యమయ్యే రైళ్లు, పాతబడిన మౌలిక సదుపాయాలకు మారుపేరుగా ఉండేవి. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, 'కవచ్' భద్రతా సాంకేతికత, 100శాతం విద్యుదీకరణ, ఆధునిక సరుకు రవాణా కారిడార్లు, ఆధునీకరించిన రైల్వే స్టేషన్లు, హైడ్రోజన్ ఆధారిత రైళ్ల గురించి ప్రపంచం మాట్లాడుకుంటోంది. ఇది సాధారణ ఆధునీకరణ మాత్రమే కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయ రైల్వేలో జరుగుతున్న అతిపెద్ద మార్పు ఇది. ఇది ఒక రైల్వే విప్లవం. దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వేలు అభివృద్ధి చెందాలనేది ప్రధాని మోదీ ఆలోచన. నరేంద్ర మోదీ నాయకత్వంలో, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ దార్శనికతతో, భారతీయ రైల్వే చరిత్రలోనే అతిపెద్ద ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. వేలాది కిలోమీటర్ల నూతన రైల్వే లైన్లను నిర్మిస్తున్నారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ భారతదేశానికి హై-స్పీడ్ రైలును తీసుకువస్తూ, ప్రపంచ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను నిర్మించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని నిరూపిస్తోంది. పర్యావరణహిత రవాణా రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని హైడ్రోజన్ రైలు నిరూపిస్తోంది. మన మంగళగిరి రైల్వేస్టేషన్‌లో ఎక్కువ రైళ్లు ఆగేలా చూడాలని ఈ సందర్భంగా పెద్దలను కోరుతున్నా" అని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

### కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం

"డబుల్ ఇంజన్ సర్కార్ అనేది చాలా అవసరం. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు.. ఇద్దరూ కలిసికట్టుగా ఆంధ్ర రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా 'సౌత్ కోస్ట్ రైల్వే జోన్'ను ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల ఆకాంక్షను మోదీ నెరవేర్చారు. కేంద్ర సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. పోలవరం ప్రాజెక్టుకు నిధులు తీసుకువచ్చాం. ఈరోజు ఏకంగా మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నాం. మంగళగిరిలో రెండేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. శ్మశానాల దగ్గర నుంచి కమ్యూనిటీ భవనాలు, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, రైల్వే స్టేషన్ ఆధునీకరణవంటి ఎన్నో పనులను ప్రజాప్రభుత్వం చేపట్టింది" అంటూ కూటమి పాలనలో రాష్ట్ర ప్రగతిని లోకేష్ వివరించారు.


### నా గౌరవాన్ని నిలబెట్టారు

"2019లో మీ సమస్యలు నేను తెలుసుకోలేకపోయా. నేనేంటో మీకు అర్థంకాలేదు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లు కష్టపడ్డా. మీ మనస్సులు గెలుచుకున్నా. ఎవరూ ఊహించని విధంగా మంగళగిరిలో 91వేల మెజార్టీతో విజయం సాధించా. మీరే నా కొండంత బలం. ఈరోజు నేను ఏ మంత్రితో మాట్లాడినా మంగళగిరి అభివృద్ధికి సహకరిస్తున్నారు. నా గౌరవాన్ని మీరు నిలబెట్టారు. నాపై బాధ్యత పెరిగింది. గడిచిన రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. ఇది తొలి అడుగు మాత్రమే. భవిష్యత్‌లో అనేక కార్యక్రమాలు చేపడతాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు ఏపీని అభివృద్ధి పథంలో పరిగెత్తిస్తున్నారు. ఈరోజు అనేక పరిశ్రమలు ఏపీకి తరలివస్తున్నాయి. రాయల్ ఎన్ ఫీల్డ్, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, ఏఎంసీఏ ప్రాజెక్ట్ ఏపీని వెతుక్కుంటూ వచ్చాయి. ఇంకో మూడేళ్లలో నిరుద్యోగ యువత పక్క రాష్ట్రాలవైపు చూడాల్సిన పనిలేదు. పొరుగు రాష్ట్రాల నిరుద్యోగ యువత ఏపీవైపు చూసే విధంగా పెట్టుబడులు, పరిశ్రమలను తీసుకువస్తున్నాం" అని మంత్రి ఉద్ఘాటించారు.

### మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం

మంగళగిరి అభివృద్ధికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎంతో సహకరిస్తున్నారు. ఒక ఎంపీ, ఎమ్మెల్యే కలిసి పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో మంగళగిరి నిదర్శనం. మంగళగిరికి అనేక పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువచ్చి యువతకు మన ప్రాంతంలోనే ఉద్యోగాలు కల్పించే దిశగా పనిచేస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ కే.సైమన్, సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్ కుమార్, సీనియర్ డీపీవో కేప్రియల్ అరోర, సీఎంఎస్ కే.శ్రీనివాసులు, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత పాల్గొన్నారు.





ముఖ్యమంత్రి
నారా చంద్రబాబు నాయుడితో
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మిలా సీతారామన్
మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తమ
నివాసానికి వచ్చిన నిర్మాలా సీతారామన్‌కు సీఎం
చంద్రబాబు, మంత్రి నారా లోకేష్
సాదర స్వాగతం పలికారు.
సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం....
ఆయనతో కలిసి
నరసరావుపేట పర్యటనకు
బయలుదేరారు.
















నరసరావుపేటలో సీఎం
చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా
సీతారామన్‌కు జిల్లా నేతలు,
అధికారుల సాదర స్వాగతం



# అమ్మకీ.. అక్షరానికీ వందనం!







సమాజంలో ఏ శుభకార్యం తలపెట్టినా తల్లిని స్మరించుకుని ప్రారంభించడం మన సంస్కృతిలో భాగం. బిడ్డ భవిష్యత్తుకు పునాది వేసే తొలి గురువు తల్లే. ఆ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేష్ -బిడ్డల చదువులకు ఆర్థిక చేయూతనిచ్చే పథకానికి “తల్లికి వందనం” పేరు పెట్టారు. ఇది.. బిడ్డల చదువుల కోసం తల్లి పడే తపనకు, త్యాగానికి ప్రభుత్వమిచ్చే గుర్తింపు. వరుసగా రెండో ఏడాదీ విద్యా సంవత్సరం ఆరంభంలోనే పథకం నిధులు తల్లుల ఖాతాల్లో జమ చేయడానికి రంగం సిద్ధం చేయడం.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమిచ్చిన మాటకు కట్టుబడి ఉండే తీరుకు నిలువెత్తు నిదర్శనం!

## వాగ్దానం అమలులో చిత్తశుద్ధి

ఎన్నికలకు ముందు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో పిల్లల చదువులకయ్యే ఖర్చును తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడం మొదలుపెట్టారు. రాజకీయాల్లో వాగ్దానాలు సాధారణమే అయినా, వాటిని ఆచరణలో నిలబెట్టుకోవడమే అసలైన పరీక్ష. ఈ విషయంలో తల్లికి వందనం పథకం – నిలువుటద్దం. తొలి ఏడాది పట్టణ ప్రాంతాల అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేయగా, రెండో ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకూ పథకాన్ని విస్తరించడం సహృదయ నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా 17వేలమందికిపైగా అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లల చదువులకు కూడా పథకం కింద ఆర్థిక సాయం అందనుంది. అంగన్‌వాడీలు, శానిటేషన్ వర్కర్లుగా పనిచేస్తున్న వారి పిల్లలను సైతం అర్హుల జాబితాలో చేర్చడం ద్వారా సమాజంలో అట్టడుగు వర్గాల పిల్లలకూ విద్యా భరోసా కల్పించినట్టయ్యింది. పథకం విస్తరణ ఒక కోణమైతే.. సమసమాజ నిర్మాణం దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగు మరో కోణం.

## గత ఏడాది అమలు తీరు.. లబ్ధిదారుల చిత్రం

గత ప్రభుత్వ హయాంలో ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా కేవలం ఒక్కరికే ఆర్థిక సాయం అందించే విధానం ఉండేది. ఇది స్పష్టమైన వివక్షతో కూడిన విధానం. ఒక ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు చదువుతున్నా ఒక్కరికే లబ్ధి కలగడం వల్ల మిగతా పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపైనే పడేది. ఈ అసమానతను గుర్తించిన కూటమి ప్రభుత్వం, చదువుకునే ప్రతి బిడ్డకూ పథకం వర్తించేలా నిర్ణయం తీసుకుంది. ఇది సామాజిక న్యాయం దిశగా వేసిన కీలక అడుగు.

ఇప్పటివరకు అమలు జరిగిన గణాంకాలు చూస్తే ఈ పథకం తీసుకొచ్చిన మార్పు సుస్పష్టం. ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న 67,47,190 మంది విద్యార్థులకు సంబంధించి 42,70,802మంది తల్లుల ఖాతాల్లో ప్రజాప్రభుత్వం రూ. 10,120 కోట్లకుపైగా నిధులను జమ చేయనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ. 15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుండగా, అందులో రూ. 13 వేలు నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండగా, మిగిలిన రూ. 2 వేలు పాఠశాల నిర్వహణకు వినియోగిస్తున్నారు. ఈ లెక్కలు చూస్తే, ఇది కేవలం సంక్షేమ పథకమే కాదు.. రాష్ట్ర భవిష్యత్తుకు ప్రభుత్వం చేస్తోన్న అతిపెద్ద పెట్టుబడి.

## ఈ ఏడాది అమలు.. కచ్చితమైన ప్రణాళిక

విద్యా సంవత్సరం ఆరంభంలోనే నిధులు విడుదల చేయడం ద్వారా తల్లిదండ్రులపై పుస్తకాలు, యూనిఫారాలు, ఇతర విద్యా అవసరాల భారం తగ్గించే ప్రయత్నం చేస్తోంది ప్రజా ప్రభుత్వం. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలను ప్రభుత్వం ముందుగానే వెరిఫై చేసింది. అర్హులైన లబ్దిదారుల జాబితాను 22న స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రకటించి, అదే రోజు నుంచి 24 వరకు ఖాతాల్లో నగదు జమయ్యేలా నిర్మాణాత్మక ఏర్పాట్లు చేసింది.

కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న ఒకటో తరగతి మొదలుకొని తొమ్మిదో తరగతి వరకు, అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల విషయంలో అడ్మిషన్లు, ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తికాకపోతే వారికి ఆగస్టు 30నాటికి నిధులు జమ చేసేలా ప్రణాళిక సిద్ధమైంది. సాంకేతిక కారణాలవల్ల ఎవరికైనా నిధులు అందకపోతే.. నెలాఖరుకు సమస్యను పరిష్కరించాలన్నది మంత్రి లోకేష్ ఆదేశం. ఇది పథకం అమలులో ప్రభుత్వం చూపుతున్న జవాబుదారీతనానికి నిదర్శనం కాకపోదు. అర్హులైన లబ్దిదారుల వివరాలను మనమిత్ర, లీప్ యాప్‌ల ద్వారా తెలుసుకునే వెసులుబాటు కల్పించడం.. పారదర్శకతకు పెద్దపీట.

## విద్యారంగంలో సమూల మార్పులు

‘తల్లికి వందనం’.. మంత్రి నారా లోకేష్ చేపడుతున్న విస్తృత విద్యా సంస్కరణల్లో స్వల్ప భాగం మాత్రమే. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను తీర్చిదిద్దే దిశగా యువమంత్రి చేపట్టిన బృహత్తర యజ్ఞంలో కీలక ఘట్టం.దేశంలోనే విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, అత్యధిక మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చే పథకంగా తల్లికి వందనం నిలుస్తోంది. ఎటువంటి ఆంక్షలు లేకుండా, పిల్లలను చదివించడమే అర్హతగా పథకాన్ని రూపొందించడం మామూలు విషయంగా చూడలేం. ఆర్థిక స్థోమత, సామాజిక హోదాతో సంబంధం లేకుండా చదువుకునే ప్రతి బిడ్డ పథకం పరిధిలోకి రావడం సమానత్వ సూత్రానికి నిదర్శనం.

## భవిష్యత్తుపై ప్రభావం

ఏ సమాజమైనా ముందుకు సాగాలంటే విద్య పునాదిగా నిలవాలి. తల్లికి వందనం లాంటి పథకాలు కేవలం తక్షణ ఆర్థిక సాయం మాత్రమే కాదు.. దీర్ఘకాలంలో రాష్ట్ర మానవ వనరుల నాణ్యతను పెంచే వ్యూహాత్మక పెట్టుబడి. బడి మానేసే పిల్లల సంఖ్య తగ్గించడంలో, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో పిల్లలు మధ్యలో చదువు ఆపేసే పరిస్థితిని నివారించడంలో ఇలాంటి పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం వల్ల ఆ డబ్బు నిజంగా పిల్లల చదువు కోసమే వినియోగించబడే అవకాశం ఎక్కువ. ఇది కుటుంబంలో తల్లి పాత్రకు, నిర్ణయాధికారానికి కూడా బలం చేకూరుస్తుంది.

రానున్న సంవత్సరాల్లో ఈ పథకం ప్రభావం మరింత విస్తృతంగా కనిపించే అవకాశముంది. ఒక తరం విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల భయం లేకుండా చదువు కొనసాగించగలిగితే, అది రాష్ట్ర భవిష్యత్తుకు దృఢమైన పునాదిగా మారుతుంది. నైపుణ్యంతో కూడిన మానవ వనరుల కల్పన ద్వారా పరిశ్రమలకు, ఉద్యోగ కల్పనకు, తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది దోహదపడుతుంది. విద్యలో పెట్టుబడి అంటే భవిష్యత్తులో పెట్టుబడి అనే సూత్రాన్ని కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపిస్తోంది.

## చంద్రబాబు, లోకేష్‌ల దూరదృష్టి

ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచీ విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. రాష్ట్రాన్ని ‘జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ’గా తీర్చి దిద్దాలన్న దార్శనికతలో భాగంగానే విద్యాశాఖను మంత్రి నారా లోకేష్‌కు అప్పగించారు. యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, తల్లిదండ్రుల ఇబ్బందులను ప్రత్యక్షంగా అర్థం చేసుకున్న లోకేష్, ఆ అనుభవాన్ని విధానరూపకల్పనలో ప్రతిబింబించారు. ఎన్నికల వాగ్దానాలకే పరిమితం కాకుండా.. కచ్చితమైన కాలపరిమితితో అమలు చేయడం ద్వారా పరిపాలనలో నిబద్ధత చాటుకున్నారు. వరుసగా రెండో ఏడాదీ విద్యా సంవత్సరం ఆరంభంలోనే నిధులు విడుదల చేయడం నిబద్ధతకు తార్కాణం. చదువుకునే ప్రతి చిన్నారికి ‘తల్లికి వందనం’ పథకం అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి లోకేష్ అనేక సందర్భాలలో స్పష్టం చేయడం.. ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. గత ప్రభుత్వ హయాంలో ఉన్న వివక్షాపూరిత విధానానికి ముగింపు పలికి, చదువుకునే ప్రతి బిడ్డకూ పథకాన్ని వర్తింప జేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించారు. పిల్లల చదువుల కోసం ఏటా భారీగా ఖర్చు చేయాల్సి వస్తున్న నేటి రోజుల్లో, విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఆర్థిక సాయం అందడం తల్లిదండ్రులకు గొప్ప ఊరట. పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫారాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు ఈ నిధులు ఉపయోగ పడతాయి. ముఖ్యంగా మధ్యతరగతి, పేద కుటుంబాలకు ఇదిగణనీయమైన ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, శానిటేషన్ వర్కర్ల కుటుంబాల వరకూ పథకాన్ని విస్తరించడం ద్వారాసమాజంలో అట్టడుగు వర్గాలకూ ప్రభుత్వం అండగా నిలిచింది.

తల్లికి వందనం పథకం కేవలం ఒక ఆర్థిక సాయం కార్యక్రమం మాత్రమే కాదు.. అమ్మ ఒడిలో అక్షరాభ్యాసం చేసిన ప్రతి బిడ్డకూ, ఆ తల్లి కష్టానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వందనం. చదువుకునే హక్కు ప్రతి బిడ్డకూ సమానంగా దక్కాలన్న సూత్రంతో రూపొందించిన ఈ పథకం, రానున్న తరాలకు బలమైన విద్యా పునాదిని నిర్మించనుంది. వరుసగా రెండో ఏడాదీ నిర్దేశిత సమయానికే నిధులు విడుదల చేయడం ద్వారా చంద్రబాబు, లోకేష్‌ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తన మాటకు కట్టుబడి ఉందని, ఉంటుందని మరోసారి రుజువు చేసుకుంది. తల్లుల ఖాతాల్లో నగదు జమ కావడం.. లక్షలాది కుటుంబాల్లో వెలుగుతున్న ఆశాజ్యోతి. ఈ పథకం రాష్ట్ర భవిష్యత్తుకు వేస్తున్న బంగారు బాటగా చరిత్రలో నిలిచిపోవడం ఖాయం!

- మహాదేవ

# తక్కువ నాణ్యత పొగాకుకూ గిట్టుబాటు ధర

- కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలి
- కంపెనీలతో చర్చించి ధరలు పెరిగేలా పొగాకు బోర్డు చర్యలు తీసుకోవాలి
- 2026-27లో ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాం
- టెలీకాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలు చేపట్టాలని పొగాకు బోర్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శుక్రవారం పొగాకు కొనుగోళ్ల పురోగతిపై మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల వేగవంతంపై విస్తృతంగా సమీక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా పొగాకు కొనుగోళ్లు గణనీయంగా ఊపందుకున్నాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 8.5 లక్షల కిలోల పొగాకును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గరిష్ఠంగా కిలోకు రూ.250 వరకు ధర లభిస్తోందని, రైతులకు మరింత మెరుగైన ధర వచ్చేలా కొనుగోలు సంస్థలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని పొగాకు బోర్డును కోరారు. ముఖ్యంగా, పొగాకు కొనుగోలు సంస్థలపై



సమర్థవంతంగా ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు ఇంకా అధిక ధర లభించేలా చర్యలు చేపట్టాలని పొగాకు బోర్డు చైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు సూచించారు. కొనుగోళ్లు మరింత వేగవంతం కావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. అలాగే, తక్కువ నాణ్యత గల పొగాకును సాగు చేసిన రైతులు కూడా నష్టపోకుండా వారికి కూడా గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు సంస్థలతో ప్రత్యేకంగా చర్చలు జరపాలని టొబాకో బోర్డు అధికారులకు మంత్రి ఆదేశించారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 2026-27 సీజన్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసే దిశగా వ్యవసాయ శాఖ, టోబాకో బోర్డుతో సమన్వయం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా రైతులకు స్థిరమైన గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## ఏపీ సాంస్కృతిక వైభవ పునరుద్ధరణ

# ప్రతిపాదనలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- నెల రోజుల్లోనే సర్క్యులర్ జారీకి హామీ
- మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శితో మంత్రి భేటీ
- ఏపీ టూరిజంలో పెట్టుబడులకు 'భరోసా' మాది: ఇన్వెస్టర్లకు మంత్రి హామీ

న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించడమే ధ్యేయంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ న్యూఢిల్లీ పర్యటనలో మరో కీలక అడుగు పడింది. రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్‌తో మంత్రి కందుల దుర్గేష్ భేటీ అయి ఏపీ సాంస్కృతిక రంగానికి మహర్దశ చేకూర్చే 5 అత్యంత కీలకమైన పెండింగ్ ప్రతిపాదనల నివేదికను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంతర ప్రత్యేక ఫాలోఅప్ నేపథ్యంలో ఈ ప్రతిపాదనలపై కేంద్ర కార్యదర్శి వివేక్ అగర్వాల్ అత్యంత సానుకూలంగా స్పందించారు. వీటికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి నెల రోజుల్లోనే స్పష్టమైన రూపాన్ని తీసుకువస్తామని, త్వరలోనే అధికారిక సర్క్యులర్‌ను జారీ చేస్తామని మంత్రి దుర్గేష్‌కు కేంద్ర కార్యదర్శి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ పరిణామాల పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి దుర్గేష్ త్వరలోనే రాష్ట్ర సాంస్కృతిక రంగానికి మహర్దశ రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి దుర్గేష్ సమర్పించిన ప్రతిపాదనల్లో చారిత్రక, సాంస్కృతిక నగరమైన రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్' కేంద్రాన్ని నెలకొల్పడం, ఏపీలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రాన్ని స్థాపించడం, విజయవాడ లోని జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో అత్యాధునిక 'కళాక్షేత్ర ఆడిటోరియం' నిర్మాణం చేపట్టడం, కడప లో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పునర్వైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. తమ విజ్ఞప్తులకు కేంద్రం తక్షణమే స్పందించి, నెల రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడం రాష్ట్ర కళాకారులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

అంతకుముందు దేశ రాజధానిలో జరుగుతున్న ప్రతిష్టాత్మక "ఫెయిత్ టూరిజం కాన్‌క్లేవ్-2026" లో రెండో రోజు పాల్గొన్న మంత్రి దుర్గేష్ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కాన్‌క్లేవ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏపీ టూరిజం స్టాల్‌ను మంత్రి దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు, సందర్శకులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగ విశిష్టతలను, చారిత్రక, ఆధ్యాత్మిక వైభవాన్ని ఆయన స్వయంగా వివరించారు. ఉదయం సెషన్‌లో భాగంగా పలువురు జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ ప్రతినిధులు, ఇన్వెస్టర్లతో మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వారికి వివరించి, భాగస్వాములు కావాల్సిందిగా ఆహ్వానించారు. మంత్రి దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఏపీ పర్యాటక రంగ పెట్టుబడులపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు.

## అనపర్తి టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా నల్లమిల్లి మనోజ్ కుమార్ రెడ్డి

అమరావతి (చైతన్యరథం): తూర్పు గోదావరిజిల్లా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా నల్లమిల్లి మనోజ్ కుమార్ రెడ్డిని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు ఆ నియామకం చేపట్టినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

### పర్యాటకాభివృద్ధికి ఊతమిచ్చేలా

# కొత్త టూర్ ప్యాకేజీలు

- అదే సమయంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు
- ఏపీటీడీసీ పనితీరుపై సమీక్షలో చైర్మన్ డా. నూకసాని బాలాజీ



విజయవాడ (చైతన్యరథం): ఆదాయాన్ని పెంచుకుంటూనే.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ డా.నూకసాని బాలాజీ ఆదేశించారు. విజయవాడలోని ఏపీటీడీసీ కార్పొరేట్ కార్యాలయంలో డా. నూకసాని బాలాజీ సంస్థ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ పరిధిలోని హోటల్స్, వాటర్ ఫ్లీట్, ఆర్థిక విభాగం, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ), ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం), న్యాయ విభాగం, విజిలెన్స్, పరిపాలన విభాగాల పనితీరు, పురోగతి, ఆదాయ వృద్ధి, పరిపాలనా అంశాలపై అధికారులతో విస్తృతంగా సమీక్షించారు.

సమీక్ష సందర్భంగా డా.నూకసాని బాలాజీ మాట్లాడుతూ, సంస్థలోని అన్ని విభాగాలను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలోని అన్ని హోటళ్లలో ఆక్యుపెన్సీ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని వాటర్ ఫ్లీట్ యూనిట్లలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమం తప్పకుండా కఠినమైన భద్రతా తనిఖీలు (సేఫ్టీ ఆడిట్లు) నిర్వహించాలని ఆదేశించారు. లీజుదారుల వద్ద పెండింగ్‌లో ఉన్న బకాయిలను వేగవంతంగా వసూలు చేయడంతో పాటు సంస్థ ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రధాన కార్యాలయం, క్షేత్రస్థాయి యూనిట్లలో సిబ్బంది పునర్వ్యవస్థీకరణ చేపట్టి మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న న్యాయ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే విజిలెన్స్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానం ప్రకారం రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ఊతమిచ్చేలా కొత్త టూర్ ప్యాకేజీలను రూపొందించాలని అధికారులకు సూచించారు.

అలాగే విజయవాడ స్థానిక దర్శన ప్యాకేజీలతో పాటు శ్రీశైలం, వాడపల్లి, ఇతర పర్యాటక అవకాశాలు ఉన్న ప్రాంతాలకు కూడా ప్రత్యేక ప్యాకేజ్ రూపొందించాలని ఆదేశించారు.

సంస్థ ఆదాయ వృద్ధి, పర్యాటకులకు నాణ్యమైన సేవలు, భద్రతా ప్రమాణాల అమలు, సమర్థవంతమైన పరిపాలన లక్ష్యంగా ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. నూకసాని బాలాజీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ‘ఎల్‌నినో’ను సమష్టిగా ఎదుర్కొందాం

- కాల్వగట్ల పై నిరంతర పర్యవేక్షణతో సత్ఫలితాలు
- చివరి ఎకరం వరకు నీరందించేందుకు చర్యలు
- సంక్షోభ నివారణకు సీఎం చంద్రబాబు నిరంతర కృషి
- సహకరించాలని అన్నదాతలకు మంత్రి నిమ్మల పిలుపు



అమలాపురం (చైతన్యరథం): రాష్ట్రానికి ఆయువు పట్టు, గుండెకాయ లాంటి గోదావరి డెల్టాకు సైతం నేడు సూపర్ ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తి నీటి సంక్షోభం నెలకొందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శుక్రవారం ఆయన పర్యటించారు. గోదావరి సెంట్రల్ డెల్టా కాలువల వెంబడి లాకుల నీటిమట్టాన్ని మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి శుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందంలు మోటార్ సైకిళ్లపై తిరుగుతూ సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లొల్ల లాకులు వద్ద మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. 70 ఏళ్ల చరిత్రలో జూలై నెలలో గోదావరిలో రోజుకి అత్యంత కనిష్ఠంగా 15000 క్యూసెక్కులు రావటం ఇదే తొలిసారన్నారు.

సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో అంటే రెండో పంటకు గోదావరి నీరు సరిపోకపోతే సీలేరు నుంచి ఐదారు వేలు క్యూసెక్కులు తీసుకోవడం పరిపాటి అన్నారు. అలాంటిది వర్షాకాలం జూలై నెలలో కూడా సీలేరు జలాలు తీసుకుంటున్నామని రామానాయుడు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ సంక్షోభ సమయంలో సమష్టిగా ముందుకు వచ్చి క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజలకు అండగా నిలబడుతుతోందన్నారు. సాధారణంగా ఏ డెల్టా వ్యవస్థలోనైనా 70శాతం కాలువలు, 30 శాతం వర్షం పై ఆధారపడి డిజైన్ చేస్తారని చెప్పారు. డెల్టా లో వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రస్తుత సంక్షోభం తలెత్తిందన్నారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు రైతులు నీరు తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటలు, స్వల్ప కాలపరిమితి పంటలు వేసుకోవాలని సూచించారు. సాగునీటి కంటే ముందు ఉన్న మొత్తంలో తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

పైస్థాయి నుండి కింది స్థాయి వరకూ ఇరిగేషన్ అధికారులు, రెవిన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కాలువల వెంట పర్యటిస్తూ నీటి వృథాను అరికట్టాలన్నారు. ఈ క్రమంలో భాగంగా అత్యవసర ప్రాతిపదికన అవసరమున్న చోట ఓఅండ్ఎం నిధులతో తక్షణ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇరిగేషన్, రెవిన్యూ, నీటి సంఘాల సమన్వయంతో నీటి సంరక్షణ చేపట్టాలని ఆయన సూచించారు. సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో నీటిదుర్వినియోగం కాకుండా, పొదుపు పాటించేలా అధికారులు, రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి నిర్వహణ విజయవంతం చేయడం ద్వారా ఎల్‌నినో ను అధిగమించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించామన్నారు .

### లొల్ల లాకులకు రూ.72 కోట్లు

గోదావరి డెల్టాలో ప్రస్తుత సంక్షోభానికి ఎల్‌నినో తోపాటు ఐదేళ్ల జగన్ పాలన కూడా కారణమని రామానాయుడు విమర్శించారు. అతని నిర్లక్ష్యం కారణంగా గోదావరి డెల్టా కాలువలు, లాకులు, షట్టర్లు అన్నీ దెబ్బతిని పోయాయన్నారు. గోదావరి డెల్టాకి గుండె అయిన ధవళేశ్వరం బ్యారేజ్ గేట్లనే జగన్ పట్టించుకోలేదన్నారు. ఈ కారణంగానే బ్యారేజ్‌కి రూ. 150 కోట్లు వ్యయంతో నేడు కొత్త గేట్లు ఏర్పాటు చేస్తున్నామని రామానాయుడు చెప్పారు. అలాగే లొల్ల లాకుల పునర్నిర్మాణానికి రూ. 74 కోట్లు కేటాయించామని చెప్పారు.

### సాధారణం కంటే 50 శాతం తక్కువ

రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం మండలాల్లో గడిచిన 45 రోజులుగా సాధారణ వర్షపాతం కంటే 50 శాతం తక్కువ పడిందని మంత్రి రామానాయుడు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ పై ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నీటి యాజమాన్య పద్ధతులు, ఆయన ముందుచూపు వల్ల పరిస్థితి చాలా వరకు అదుపులో ఉందన్నారు. రైతు సోదరులంతా ప్రభుత్వ సూచనలు తప్పక పాటించాలన్నారు. పూర్తి సహాయ సహకారాలు అందించి సంక్షోభాన్ని అధిగమించాలని ఆయన పిలుపునిచ్చారు.

### దాదాపు 90 కి. మీ బైక్ పై ప్రయాణం

ధవళేశ్వరం బ్యారేజ్ దగ్గర గోదావరి హెడ్ స్లుయిజ్ నుండి బైక్ పై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలసి బైక్ పై బయలుదేరిన మంత్రి నిమ్మల కొత్తపేట నియోజకవర్గంలో లొల్ల లాకులు, పలివెల లాకులు, పి.గన్నవరం నియోజకవర్గంలో ముక్కామల లాకులు, అమలాపురం నియోజకవర్గంలో నడిపూడి లాకులు, సమానస లాకులు పరిశీలించారు. మార్గధ్యలో సహచర మంత్రి వాసంశెట్టి శుభాష్ సైతం కలసి కొంత మేర కాలువ గట్టు వెంట బైక్‌పై ప్రయాణించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మార్గమధ్యలో ముక్కామల లాకులకు దిగువన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కారణంగా తవ్విన మట్టి కాలువలో వేయడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండి దిగువన 40 వేలకు పైగా ఎకరాలకు సాగు నీరందక ఇబ్బంది పడుతున్నామని మంత్రి నిమ్మల దృష్టికి స్థానిక రైతులు తీసుకొచ్చారు. వెంటనే జిల్లా కలెక్టర్ ను, ఇరిగేషన్ అధికారులను పిలిపించి అనుమతులు లేకుండా కాలువ నీటి ప్రవాహానికి మట్టి అడ్డుగా పోసి రైతుల సాగునీటికి ఇబ్బంది కలిగించినందుకు సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీపై కేసు పెట్టాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ సైతం వెంటనే సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం అమలాపురం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సాగునీటి నిర్వహణకు ఉన్న అడ్డంకులపై సమీక్ష నిర్వహించారు. ఆయకట్టు చివరి ఎకరం వరకు కూడా సాగునీటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలసి పని చేసేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు సత్యానంద రావు, దేవ వరప్రసాద్, దాట్ల సుబ్బరాజు, అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రవిరాల, గోదావరి డెల్టా సిఈ చిన్నబాబు, ఎస్ఈ శ్రీనివాస్, సాగునీటి సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని అడ్డుకొనే సైంధవులకు హైకోర్టు వాతలు!

అస్సంబద్ధమైన, అర్థరహితమైన, పసలేని, పనికి మాలిన ఆరోపణలతో సీఎం చంద్రబాబుకు మసి పుయ్యాలనుకోవడం సాధ్యమా జగన్‌రెడ్డి? చంద్రబాబుకు మసి పూయాలి అంటే జగన్‌రెడ్డి మరో పది జన్మలు ఎత్తాలి. గంద సింధూరం రాజమార్గాన పోతుంటే ఎన్ని కుక్కలు మొరిగితే ఏమవుతుంది? ఆ విధంగానే చంద్రబాబుపై జగన్ ఎన్ని కుట్రలు చేసి అక్రమ కేసులు పెట్టినా చివరికి న్యాయమే గెలిచింది. అసైన్డ్ భూముల విషయంలో జగన్ కుట్ర సిద్ధాం తానికి హైకోర్టు ఇచ్చినతీర్పు చావుదెబ్బ అని చెప్పాలి. హైకోర్టు అద్భుతమైనతీర్పు ఇవ్వడం అభినందనీయం. నిరాధారమైన ఆరోపణలతో బురద చల్లడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం జగన్ మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబు వంటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిపై పసలేని పనికి మాలిన ఆరోపణలతో ప్రజల దృష్టిని మళ్ళించాలనుకోవడం జగన్ అజ్ఞానం. చంద్రబాబుకు వ్యక్తిగతం లేదు. ప్రజలు,రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అంటూ నిరంతరం శ్రమిస్తున్న మచ్చలేని మహానాయకుడు.ఆయన ఏ తప్పు చేయరు,ఎవ్వరినీ తెలిసి తప్పు చెయ్యనివ్వరు. చంద్రబాబుకు ప్రజలంటే బయం. ఆయన పాలనలో ప్రజలకు జవాబు దారీగా వుంటారు. స్వార్థ రహిత పాలన ఆయన విధానం. సమాజ అభివృద్ధి ఆయన సిద్ధాంతం. సమ సమాజ స్థాపన ఆయన ఆశయం. పేదరికం లేని సమాజం ఆయన అభిమతం. ఎన్నడూ అవినీతి మరక అంటని చంద్రబాబు కి అవినీతి మరక అంటించి ఆయనను అవినీతి పరుడుగా చిత్రించాలని చూసారు జగన్ ముఠా. అవినీతి పరులు రాజ్యం ఏలినప్పుడు నిజాయితీ పరులకు కష్టాలు తప్పవు. అందుకే తాను అవినీతి బురదలో కూరుకు పోయి రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబును కూడా అవినీతి పరుడుగా చిత్రించాలన్న అక్కసుతో ఆధారాలు లేని అక్రమ కేసు పెట్టి న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టాలని చూశారు జగన్ రెడ్డి. అమరావతి రాజధానిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించి ఆంధ్రుల ఆత్మవిశ్వాసాన్ని శిఖర సమానంగా నిలపాలని ప్రణాళిక సిద్ధం చెయ్యడం నేరమా? భవిష్యత్ అవసరాలకు ఎదురు కాబోయే సవాళ్ళను ఎదుర్కొనే విధంగా అమరావతి రాజధానికి బలమైన పునాదులు వేయడం, ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా, ఉజ్వల మైన, విభిన్న మైన, సమ్మిళితమైన, అధునాతనమైన నగరంగా రాజధాని ఉండాలని అద్భుత ప్రణాళికతో రైతులను మెప్పించి, వారు కోరిన విధంగా ప్యాకేజి ఇచ్చి వారికి నష్టం లేకుండా ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా 28 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా భూములు ఇచ్చే విధంగా చేసి దేశానికే ఆదర్శంగా నిలపడం చంద్రబాబు చేసిన నేరమా?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులపై నమోదైన పలు కేసులు, అరెస్టులు, విచారణలు.. రాజకీయ ఉద్దేశంతో, ప్రతీకారంతో జరిగినట్లు హైకోర్టు తీర్పు ద్వారా వెల్లడి అయింది. ఇందుకు అమరావతి రాజధాని అసైన్డ్ భూముల కేసుల విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పే ఉదాహరణ అని చెప్పాలి. రాజధాని అమరావతి ఎసైన్డ్ భూముల విషయంలో ఇచ్చిన జీవోపై సీఐడీ నమోదు చేసిన కేసు రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికే తప్ప మరొకటి కాదని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు నేరపూరిత చర్యలను ఆపాదిస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది హైకోర్టు.శాసనసభ తీసుకున్న నిర్ణయాలకు నాయకులను శిక్షించడమంటే వారిని ఎన్నుకున్న ప్రజలను శిక్షించడమేనని ఘాటుగా వ్యాఖ్యానించింది. వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజకీయ ప్రతీకారమేనని స్పష్టం చేసింది. ఎసైన్డ్ జీవో వల్ల నష్టపోయినట్లు ఒక్క గ్రామస్థుడు కూడా పిర్యాదు చెయ్యలేదని, వైసీపీ ఎమ్మెల్యే మాత్రం గత ప్రభుత్వ పాలనను అప్రదిష్ట పాలు చేసేందుకు ప్రయత్నించారని హైకోర్టు ఆక్షేపించింది. బిజినెస్ రూల్స్ కు అనుగుణంగా సీఆర్డీఏ చట్ట పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 17న జీవో 41 జారీ చేసింది. అలాంటి జీవో విషయంలో ఐపీసీ, తదితర చట్టాల కింద నేర విచారణకు వీల్లేదని, చంద్రబాబు, నారాయణలు చట్టాన్ని ఉల్లంఘించలేదని, వారు తీసుకొన్న నిర్ణయాలను దురుద్దేశ, నేరపూరితమైనవని చెప్పడానికి వీల్లేదని, అలాంటి పనులకు నేరాన్ని ఆపాదించడమంటే శాసనసభ ఉద్దేశాలకు నేరాన్ని అపాదించడమే అని స్పష్టం చేసింది హైకోర్టు. ఈ కేసులో ఆళ్ల ఊహా జనితంగా నేరారోపణలు చేశారని, ప్రభుత్వం విధాన నిర్ణయాలకు అనుగుణంగా జీవో జారీ చేయడాన్ని మంత్రులు, అధికారుల మధ్య జరిగిన నిర్ణయాన్ని నేరపూరిత కుట్రగా చిత్రీకరించడం ప్రమాదకరమైన ధోరణి అని, దీన్ని కోర్టు అనుమతించదని, రాజకీయ ప్రతీకారంతో నమోదు చేసిన కేసు తప్ప మరొకటి కాదని, రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల చేసిన ఫిర్యాదు లో ప్రజాప్రయోజనం లేదని, రాజకీయ వైరం, దురుద్దేశాలు మాత్రమే కనిపిస్తున్నాయని హైకోర్టు వాతలు పెట్టింది.

ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని, చట్టపరంగా ఈ ఎఫ్ఐఆర్, చార్జిషీటు చెల్లవని తేల్చిచెబుతూ కొట్టివేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతిపక్ష నేతలపై జరిగిన దాడులు, నమోదు చేసిన కేసుల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను హైకోర్టు గమనించింది. అమరావతి అసైన్డ్ భూముల కేసులో చంద్రబాబు, నారాయణలపై కక్షపూరితంగా కేసులు బనాయించారని చెబుతూ గత ప్రభుత్వ తీరును హైకోర్టు ఎండగట్టింది. రాజకీయ ప్రత్యర్థులపై చట్టాన్ని ఆయుధంగా వాడరాదంటూ అంటూ న్యాయస్థానం హెచ్చరిక చేసి, ప్రజాస్వామ్య విలువలను గుర్తుచేసి రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించింది. ఒక పరిపాలనా నిర్ణయాన్ని నేరంగా పరిగణించడం ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదకరం. గత ప్రభుత్వ హయాంలో విధానపరమైన నిర్ణయాలను అడ్డం పెట్టుకుని, చంద్రబాబు, నారాయణలను ఇబ్బందులకు గురిచేయడం వెనుక ఉన్న కక్ష సాధింపును హైకోర్టు గుర్తించింది. అధికార దుర్వినియోగాన్ని హైకోర్టు తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేసిన తీరు, వ్యవస్థల బాధ్యతను మరోసారి గుర్తు చేసింది. చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు కేవలం పస లేనివి, అసంబద్ధమైనవి, అర్థరహితమైనవని హైకోర్టు వ్యాఖ్యలు ద్వారా రుజువయింది. ఈ నిరాధార ఆరోపణల వెనుక ఉన్న జగన్ రెడ్డి వ్యూహం చివరకు ఆయనే అభాసుపాలు కావడానికి దారితీసింది.

- నీరుకొండ ప్రసాద్



# ఐదు కోట్ల ప్రజల కలల రాజధాని

# అమరావతి!

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా నది ఒడ్డున వెలసిన అమరావతి, 2,200 ఏళ్లకు పైగా గొప్ప చారిత్రక, బౌద్ధ, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పురాతన నగరం. శాతవాహనుల రాజధానిగా, ప్రపంచ ప్రసిద్ధ బౌద్ధ స్థూపానికి నిలయంగా వెలిగి, ప్రస్తుతం ఆధునిక ఆంధ్రప్రదేశ్ రాజధానిగా రూపుదిద్దుకుంటోంది. చరిత్ర లోతుల్లోంచి మన సంస్కృతితో ముడిపడిన మన చారిత్రక వైభవాన్ని చాటిచెప్పి, ప్రపంచానికి నాగరికతను నేర్పిన ఆ పేరే అమరావతి. ఆ పేరు తలుచుకుంటే చాలు ప్రజల నరనరాల్లో తెలియని ఉద్వేగం ఉప్పొంగుతుంది. 2019-24 మధ్యకాలంలో విధ్వంస పాలకుల చేతిలో శిథిలమైన అమరావతి స్వప్నం తిరిగి పునర్జీవం దిశగా వడివడిగా అడుగులు వేస్తూ అమరావతి పునర్నిర్మాణ పనులకు గత ఏడాది మే 2న దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదుగా శ్రీకారం చుట్టుకుంది. చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిన నాటి అమరావతే నేడు ఆంధ్రుల ఆధునిక రాజధాని నగరంగా మారబోతుంది. ఆ మలుపునకు కర్త, కర్మ, క్రియ మొత్తం తానే అయి నిలిచిన పార్టీ టీడీపీ.

### ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ

ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి ధ్యేయం. అమరావతి కేవలం ఒక రాజధాని కాదు...ఇది ఆంధ్రప్రదేశ్ కల. 5 కోట్ల ఆంధ్రులు కలలుకన్న రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ విజయవంతమై శాశ్వత రాజధానిగా నిలదొక్కుకుంది. అమరావతి అభివృద్ధికి కేంద్ర స్థాయి నుంచి చట్టబద్ధమైన రక్షణ లభించింది. పొరుగు రాష్ట్రాలకు దీటైన రాజధానిగా అమరావతి శాశ్వతంగా రూపుదిద్దుకుంటోంది. 13 ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి ఆదాయ వనరు, 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాల కల్పవల్లి మన అమరావతి. చంద్రబాబు దూరదృష్టితో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాజధాని అమరావతిలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు ఏర్పడబోతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఆర్థిక కేంద్రంగా అమరావతి రూపుదిద్దుకోవటం రాష్ట్రానికి గర్వకారణం. ఆర్థిక వ్యవస్థ బలోపేతం, పెట్టుబడుల ఆకర్షణ సహా ప్రపంచస్థాయి కార్యక్రమాలకు అమరావతి కీలక కేంద్రమవుతుంది. అమరావతిలో సుమారు రూ.2500 కోట్ల వ్యయంతో రెండు భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 5.35 ఎకరాల్లో రూ.1,299 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ కార్యాలయ కాంప్లెక్స్, మరో 17 ఎకరాల్లో రూ.1,235 కోట్ల వ్యయంతో కేంద్ర ఉద్యోగుల గృహ సముదాయం నిర్మాణం కాబోతున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు అమరావతి సమాన దూరంలో, నడిబొడ్డున ఉంది. రాయలసీమ వాసులకైనా, ఉత్తరాంధ్ర వాసులకైనా రాకపోకలకు ఇది అత్యంత అనుకూలమైన ప్రదేశం. కృష్ణా-గుంటూరు జిల్లాల మధ్య, వాటర్ గ్రిడ్, రైల్వే కనెక్టివిటీ, నేషనల్ హైవేలకు దగ్గరగా ఉండటం వల్లే నిపుణులు ఈ ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదు. ఈ వాస్తవాలకు విరుద్ధంగా గొడ్డలిపార్టీ అమరావతిపై విద్వేషం వెళ్ళగక్కుతోంది.

### 2014 భూ సమీకరణ - ఒక చారిత్రాత్మక ప్రజా ఉద్యమం

జనవరి 1, 2015న విశిష్టమైన భూసమీకరణ పథకానికి సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో సీఆర్డీఏ రూపకల్పనచేసింది. కేవలం 60-90 రోజుల్లోనే 28,538 మంది రైతులు 34,395.50 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చారు. రైతుకు భూమి అంటే కేవలం ఆస్తి కాదు... అది భావోద్వేగం, గుర్తింపు, జీవనాధారం అయినప్పటికీ, వారు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం దానిని త్యాగం చేశారు. బలవంతం లేదు. స్వాధీనం లేదు. కేవలం చంద్రబాబు మీద నమ్మకంతో ముందుకు వచ్చి ఇచ్చారు. దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలోనే ఇంత భూమిని ఏ నాయకుడూ స్వచ్ఛందంగా సమీకరించలేదు. ఇది కేవలం చంద్రబాబు సమర్థతపై రైతుల విశ్వాసానికి నిదర్శనం. అమరావతి భూ సమీకరణ ప్రపంచ చరిత్రలోనే అపూర్వ ఘట్టంగా నిలిచిపోయింది. రైతులు అందించిన భూమితో ప్రపంచస్థాయి గ్రీన్‌ఫీల్డ్ రాజధానిగా.. అంతర్జాతీయ సలహాదారులతో సుస్థిరమైన, భవిష్యత్ డిజైన్‌తో అమరావతి రూపకల్పన జరిగింది.

### అమరావతి రైతుల నిరసన, ఒక త్యాగాల గాథ

జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన అనంతరం దేశంలోనే అత్యంత సుదీర్ఘమైన ప్రజాస్వామ్య నిరసన ఈ ప్రాంతంలో జరిగింది. అప్పటి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు, మహిళలు రాత్రింబవళ్లూ రోడ్లపైనే ఉన్నారు. వృద్ధులు సైతం పాదయాత్రలు చేశారు. దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించి వారి చేతులకు బేడీలు వేసి జైళ్లకు తరలించి నాటి పాలకులు హింసించారు. పోలీసు కేసులు, లాఠీ ఛార్జీలు, మహిళలపై దారుణమైన దాడులు, అవమానాలు, వేధింపులకు గురయ్యారు. ఇన్ని నిర్బంధాల్లో సైతం 1631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారు. ఈ సుదీర్ఘ పోరాటంలో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారు. ఇది కేవలం నిరసన మాత్రమే కాదు. ఇది ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రజలు అమరావతికి మద్దతుతెలిపారు. రాయలసీమ నుండి ఉత్తరాంధ్ర వరకు ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారింది. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు... పోరాటాలు మరోవైపు... న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడింది.

కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం
సిరి కొడాలి, అనలిస్ట్, నాలెడ్జ్ సెంటర్



### అడ్డంకులు అధిగమించి..

అమరావతికి అడుగడుగునా అడ్డంకులు ఎదురైనా అంతిమంగా మాత్రం అడుగు బలంగా పడింది. రాజధాని అంటే కేవలం పరిపాలనా రాజధానిగా కాకుండా ప్రతి తెలుగువాడు మాకు గొప్ప రాజధాని అమరావతి ఉందని గర్వంగా తలెత్తుకునేలా ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మించాలని సీఎం చంద్రబాబు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ప్రపంచంలో టాప్-5 నగరాల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలని నిర్ణయించారు. జనావాసాలతో,విశాలమైన రహదారులు, అత్యుత్తమ ప్రజారవాణా, హాయిగొలిపే పచ్చదనం, ఆహ్లాదాన్నిచ్చే వినోద కేంద్రాలు, క్రీడా మైదానాలు, అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల శుద్ధి కేంద్రాలు, ఇలా అమరావతిని సర్వశ్రేష్ఠ నగరంగా ప్రపంచ పటంలో నిలపడానికి తొమ్మిది థీమ్ సిటీలను, 27టౌన్ షిప్‌లుగా అమరావతి నగర నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు.

వెయ్యేళ్ళ ముందుచూపుతో పగడ్బందీవ్యూహాలతో సమకాలీన భారతదేశంలో నిర్మితమైన నగరాలు, రాజధానులు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు.అందుకు సులభ, సుస్థిర జీవనానికి కావాల్సిన ప్రతి అంశాన్నీ ప్రాధాన్యతగా తీసుకొని ప్రజారాజధానిని నిర్మిస్తున్నారు.అందుకు అనుగుణంగా రాజధానిలో పరిపాలన, న్యాయ, ఆర్థిక, విజ్ఞాన, ఎలక్ట్రానిక్స్, ఆరోగ్య, క్రీడా, మీడియా, పర్యాటక వంటి తొమ్మిది థీమ్ సిటీలను నిర్మించబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచానికే గర్వకారణం కానున్నది.

### ఆ ఐదేళ్లు ఓ పీడకల...

జగన్ రెడ్డి తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువ పడిపోయింది. అమరావతి మునిగిపోయే రాజధాని అని, అమరావతికి నిర్మాణం కోసం సమకూర్చుకున్న నిధులను ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని అబద్ధపు ప్రచారంచేశారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2లక్షల కోట్ల రూపాయల విలువైన 130పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యా సంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశారు. ఏపీలో 3 రాజధానులు పెడతామంటూ ప్రచారం చేసిన జగన్ రెడ్డి, అసెంబ్లీలో అడ్డగోలు తీర్మానాలతో హడావుడి చేసి, శాసనమండలిలో 3 రాజధానుల బిల్లులు పాస్ చేయలేదనే నెపంతో అప్పటి చైర్మన్ షరీఫ్‌పై సభలోనే దాడి చేయించారు. అమరావతిని పూర్తిగా చంపేయాలనే దుష్ట ఆలోచనలతో జగన్ రెడ్డి అండ్ కో రాజధాని రైతులను చిత్ర హింసలకు గురి చేశారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చాడు. ఎక్కడి పనులు అక్కడ ఆపేశాడు. వీలైతే కూల్చేశాడు. రోడ్లను తవ్వేసి మరీ వైసీపీ నేతలు, కార్యకర్తలకు దోచుకున్నారు.

రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటీరియల్ ను కూడా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దోపిడీ చేయించారు. కాంట్రాక్టర్లను తన్ని తరిమేశారు. టీడీపీ ప్రభుత్వంలో 44 ఎకరాలలో పేదల కోసం కట్టించి ఉన్న 5,024 టిడ్కో ఇళ్లను ఇవ్వకుండా పాడుబెట్టారు. ఆర్ 5 జోన్ లో చెల్లని పట్టాలతో భూములు ఇచ్చి బడుగు బలహీనులను మోసం చేశారు. ఐదేళ్ల పాటు కేంద్రానికి తప్పుడు ఫిర్యాదులు చేసి అమరావతి నిర్మాణానికి కేంద్రం నుండి సాయం రాకుండా చేశారు. రాజధాని నిర్మించేందుకు నిధులు లేవు అని చెప్పిన జగన్ తన సొంత ఖర్చులకు, తనకు సన్నిహితంగా ఉన్న ప్రజాప్రతినిధుల కోర్టు కేసులకు డబ్బులు దోచిపెట్టారు. ఇన్ సైడర్ ట్రేడింగ్ పేరుతో లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ నిరాధార ఆరోపణలు చేసి కోర్టులతో చివాట్లు తిన్నారు. ఇంత జరిగినా జగన్మోహన్ రెడ్డికి బుద్ధి రాలేదు నిత్యం కొత్త కొత్త అబద్ధాలతో కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారు. ప్రజా రాజధానిపై కుట్రలు ఆపకపోతే రాబోయే కాలంలో వైసీపీ పార్టీకి సింగిల్ డిజిట్ కూడా రాదనేది నిర్వివాదాంశం.

# అంగన్వాడీలకూ 'తల్లికి వందనం' సంతోషకరం

**- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



అమరావతి (చైతన్యరథం): అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అందరికీ "తల్లికి వందనం" పథకాన్ని వర్తింపజేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వాగతించారు. ఇది ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది ఎంతోకాలంగా ఈ శుభవార్త కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు వ్యక్తిగతంగా కలిసి తమ విజ్ఞప్తులను నాకు అందజేశారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, అర్బన్, రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించడం ఎంతో ఆనందదాయకం. అంగన్వాడీల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి రాష్ట్రంలోని అంగన్వాడీ కుటుంబం తరపున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ నిర్ణయం అంగన్వాడీ సిబ్బందికి మరింత ఉత్సాహాన్ని, భరోసాను కల్పిస్తుంది. ప్రభుత్వం వారి సేవలను గుర్తించి తీసుకున్న ఈ నిర్ణయం చిరస్మరణీయంగా నిలుస్తుందని మంత్రి సంధ్యారాణి అన్నారు.

**ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, సంక్షేమానికి**

# కూటమి ప్రభుత్వం పెద్దపీట

**మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి**




ఒంగోలు (చైతన్యరథం): ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ఒంగోలులోని జేడీ శీలం భవనంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నైట్ డ్రెస్, స్వెటర్స్, షూస్, టర్కీ టవళ్ళు, బెడ్ షీట్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్, గ్లాసులు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.లావణ్యవేణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు నైట్‌డ్రెస్, స్వెటర్స్, షూస్, టర్కీ టవళ్ళు, బెడ్ షీట్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్, గ్లాసు పంపిణీ చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆ వర్గాల పిల్లలు చదువుకుంటేనే వారి కుటుంబాల్లో పేదరికం నిర్మూలించవచ్చన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.143 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు చేశాం. రూ.200 కోట్లతో నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నాం. బాలికల భద్రత కోసం హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం డాక్టర్స్ బృందం ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు ఎక్సలెన్సీ సెంటర్లు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక ఎక్సలెన్సీ సెంటర్ ఏర్పాటు చేశాం. వీటిలో విద్యార్థులకు ఇంటర్ తో పాటు జేఈఈ మెయిన్స్, ఐఐటీ, నీట్‌కి ఉచిత శిక్షణ ఇస్తున్నాం. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఇజ్రాయిల్‌లో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ, ఆర్‌ఆర్‌బీ, రైల్వే కోచింగ్‌కి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నాం. 'కౌసలం' ద్వారా గ్రామాల్లో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వర్క్ ఫ్రం హోం అవకాశాలు కల్పిస్తున్నాం. పేద విద్యార్థులు, యువత అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలూ శ్రమిస్తున్నార'న్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. కల్పనాకుమారి, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంపై గొడ్డలి పార్టీ కుట్రలు

- **అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు**
- **2020లో బీచ్ షాక్స్ పాలసీని తీసుకొచ్చింది జగన్ ప్రభుత్వమే**
- **నేడు వాటిపై వైసీపీ నేతల అనవసర రాద్ధాంతం**
- **లిక్కర్, కల్తీ మద్యం దందాల వెనుక అసలైన డాన్ జగన్**
- **వైసీపీ ఇక ఎన్నటికీ అధికారంలోకి రాదు**
- **ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్**

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే, ప్రతిపక్ష 'గొడ్డలి పార్టీ' నాయకులు మాత్రం ప్రతిదానికీ అడ్డంకులు సృష్టిస్తూ వికృత రాజకీయం చేస్తున్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ తీరును, ఆ పార్టీ నాయకుల ద్వంద్వ విధానాలను ఎండగట్టారు. ఒకపక్క రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, భారీగా పెట్టుబడులు తీసుకురావాలని, ప్రజలందరూ ఆనందంగా ఉండేలా అన్ని రంగాలను అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం రేయింబవళ్లు కృషిచేస్తుంటే వైసీపీ నాయకులు అన్నింటికీ అడ్డం పడుతూ రచ్చ చేయటమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. అసలు వాళ్లకి ఏం కావాలో, ఏం వద్దో వాళ్లకే స్పష్టత లేదు. గతంలో అమరావతి రాజధాని పనికిరాదన్నారు. ఇప్పుడు నిరుద్యోగుల కోసం డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇస్తే.. కోర్టులకెళ్లి ఆపాలని చూస్తున్నారు. ఐటీ శాఖ మంత్రి లోకేష్ దేశవిదేశాలు తిరిగి రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తీసుకువస్తుంటే.. ఆ పెట్టుబడులు రాకుండా చేసేందుకు గొడ్డలి పార్టీ నాయకులు ఈ-మెయిల్ పిర్యాదులతో అడ్డుపడుతున్నారని రాకేష్ తప్పుబట్టారు.

విశాఖపట్నంలో డేటా సెంటర్ రావద్దు, రాయలసీమలో కొత్త కంపెనీలు, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు రావద్దు.. అంటూ ప్రజలకు మంచి జరిగే ప్రతి విషయాన్నీ నాశనం చేయాలని చూస్తున్నారు. ఇప్పుడేమో ఆ పార్టీ నాయకులు రోడ్ల మీదకు వచ్చి బీచ్ షాక్స్ పెడుతున్నారంటూ నానా గొడవ చేస్తున్నారు. నేను జగన్ మోహన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా.. అసలు ఈ బీచ్ షాక్స్ విధానానికి జీవో ఇచ్చింది ఎవరు? మీ ప్రభుత్వం కాదా? తేదీ 28-12-2020 నాడు టూరిజం డెవలప్మెంట్ పాలసీ తెచ్చింది మీరు కాదా? ఆ రోజు జీవో ఎంఎస్ నెంబర్ 11 విడుదల చేసింది మీ ప్రభుత్వం కాదా? ఆ జీవోలోని పేజీ నెంబర్ 12లో ఈ బీచ్ షాక్స్ గురించి ప్రపోజల్ పెట్టింది మీరు కాదా అని అడుగుతున్నా. కళ్లు తెరిచి చూసుకోండి. గత ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను కూటమి ప్రభుత్వం పూర్తిగా సవరించింది. మనకున్న 1052 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో సాధారణ ప్రజలు, కుటుంబాలు ప్రశాంతంగా, ఆనందంగా గడిపే ప్రధాన ప్రాంతాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. అంతర్జాతీయ పర్యాటకులు వచ్చినప్పుడు వారు సేదతీరడానికి అనువుగా, దూరంగా ఉండే నిర్దేశిత తీర ప్రాంతాలలో మాత్రమే బీచ్ షాక్స్ ఏర్పాటు చేసేలా ఒక మంచి కాన్సెప్ట్ తీసుకొచ్చాం. దీన్ని కూడా విమర్శించడం మీ అజ్ఞానానికి నిదర్శనం. జగన్ మోహన్ రెడ్డీ.. మీరు అధికారంలో ఉంటే ఒకలా, లేకపోతే మరోలా వ్యవహరిస్తారా? ఇలాంటి ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని దూండి రాకేష్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయం చేయాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న లిక్కర్ స్కాముల్లో ఉన్న నిందితులంతా జగన్ మోహన్ రెడ్డి తొత్తులేనని దూండి రాకేష్ ఆరోపించారు. మద్యం వ్యాపారంలో ఏ విధంగా కల్తీ చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారో ఈడీ, సిట్



విచారణల్లో స్పష్టంగా తేలిందన్నారు. కోర్టులు, సీబీఐ, ఈడీ, సిట్ విచారణల ద్వారా కుప్పలు కుప్పలుగా దొరుకుతున్న కాగితాలు, ఆధారాలే ఇందుకు సజీవ సాక్ష్యాలని పేర్కొన్నారు. జగన్ తో సహా ఆయన చుట్టూ ఉన్న వారంతా కల్తీ మద్యంలో వాటాదారులేనని ఆరోపించారు. కల్తీ మద్యం తయారు చేయడానికి బెల్లం అవసరమైతే, సాధారణంగా దొరికే బెల్లం దుకాణాల వ్యాపారస్తులపై సైతం అక్రమంగా కేసులు పెట్టి వేధించారని దుయ్యబట్టారు. ఆ వేధింపులు తట్టుకోలేక కొందరు వ్యాపారులు ప్రాణాలు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో బెల్లానికి కృత్రిమ కొరత సృష్టించి, ఆ బెల్లాన్ని మొత్తం జగన్ ముఠా చేజిక్కించుకుని కల్తీ మద్యం తయారు చేసి అమ్ముకుందని, ఈ విధంగా కల్తీ లిక్కర్ ద్వారా కోట్ల రూపాయల లంచాలు సేకరించి ప్రజల సొమ్మును మింగేసారని మండిపడ్డారు.

గత ప్రభుత్వ హయాంలో రుషికొండను ఏ విధంగా నాశనం చేశారో ప్రజలంతా చూశారని ఆయన గుర్తు చేశారు. రోజుకు రూ. 2 లక్షల దాకా ఆదాయం వచ్చే రుషికొండ లోని పర్యాటక కాటేజీలను కూలగొట్టి, ప్రజా ధనంతో నిరుపయోగంగా కొండ మీద ప్యాలెస్ కట్టారు. దాని వల్ల ఈరోజు ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకుండా చేశారని మండిపడ్డారు. తప్పులన్నీ చేసి, ఈరోజు మళ్లీ ఏమీ తెలియనట్టు పత్తి గింజలా వచ్చి బీచ్ షాక్స్ గురించి మాట్లాడటం చాలా దారుణమని రాకేష్ దుయ్యబట్టారు. ప్రతిదానికీ వద్దు వద్దు అంటూ అడ్డం పడటం తప్ప అసలు మీకు ఏం కావాలో మీకే తెలియదని ఎద్దేవా చేశారు. జగన్ మోహన్ రెడ్డికి, వైఎస్సార్‌సీపీకి నిర్దిష్టమైన పాలసీ ఉంటే, దాని మీద నిలబడే సత్తా ఉంటే.. వెంటనే రాష్ట్ర ప్రయోజనాల కోసం మీ పర్యాటక, అభివృద్ధి విధానం ఏంటో స్పష్టంగా ప్రకటించాలని ఆయన సూటిగా సవాల్ విసిరారు. వైసీపీ ఇక ఎప్పటికీ అధికారంలోకి వచ్చేఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. కనీసం ప్రజలకు ఇచ్చిన హామీలపైన, మీ పాలసీలపైన మీరైనా నిలబడతారా లేదా అనేది తేల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం పోయినా అడ్డగోలుగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బీచ్ షాక్స్ నిర్వహణలో ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోందని దూండి రాకేష్ వివరించారు. అక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్టమైన సెక్యూరిటీ, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి, అన్ని రకాల జాగ్రత్తలతో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళు_న్నామని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చే ఏ మంచి కార్యక్రమమైనా సరే, దాన్ని చెడగొట్టాలనే గొడ్డలి పార్టీ వినాశకర విధానం కరెక్ట్ కాదని హితవు పలికారు. జగన్ మోహన్ రెడ్డి ఈ విషయాలపై ఆత్మవిమర్శ చేసుకోవాలని డిమాండ్ చేశారు. మీరు తెచ్చిన విధానాలను మీరే మర్చిపోతూ, రోజుకో మాట మాట్లాడుతున్నారు. అసలు మీ విధానాలు ఏంటో, ఏ రోజు ఏ వైఖరి మీద ఉంటారో ముందు ప్రజలకు చెప్పి, ఆ తర్వాత కూటమి ప్రభుత్వంపై మాట్లాడాలని దూండి రాకేష్ స్పష్టం చేశారు.




**రెండు సంవత్సరాలు... రాజకీయాల్లో ఇది చిన్న కాలమే కావచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు కనిపించాలంటే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలి. ముఖ్యంగా సమాజంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల అభివృద్ధిని నిజంగా కోరుకునే నాయకత్వం ఉండాలి. ఈ రెండు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో కనిపించిన అతి పెద్ద మార్పు అదే.**

**ఒకప్పుడు ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తొచ్చే బీసీలు... ఇప్పుడు ప్రభుత్వ విధానాలకు కేంద్ర బిందువుగా మారారు. "బీసీలు బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది" అనే ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చూస్తుంటే... ఇది కేవలం సంక్షేమం కాదు... భవిష్యత్తును నిర్మించే ప్రయత్నమని అర్థమవుతోంది.**

# బీసీల భవిష్యత్తుకు బంగారు బాట



గతంలో బీసీల గురించి పెద్ద పెద్ద మాటలు వినిపించేవి. కానీ ఇప్పుడు బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొదటి బడ్జెట్‌లో రూ.39వేల కోట్లు... రెండో బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు... మూడో బడ్జెట్‌లో రూ.51వేల కోట్ల కేటాయింపు జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బీసీల సంక్షేమానికి ఇంత భారీ స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారి. ఈ నిధులు కేవలం లెక్కలకే పరిమితం కాలేదు. విద్య, ఉపాధి, నైపుణ్యం, రాజకీయ సాధికారత, స్వయం ఉపాధి... ప్రతి రంగమూ బీసీలకు కొత్త అవకాశాలు సృష్టించేలా ఉపయోగపడుతున్నాయి.

## గురుకులాల నుంచి గ్లోబల్ స్థాయికి...

పేద కుటుంబానికి చెందిన పిల్లవాడూ ఐఐటీ, నీట్, సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని వారి తల్లిదండ్రి కోరుకుంటారు. ఆ కల నిజం కావాలంటే నాణ్యమైన విద్య అవసరం. అందుకే రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 109 బీసీ గురుకులాలకు తోడు మరో 10 కొత్త గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.500 కోట్లతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తోంది. సంవత్సరాలుగా అద్దె భవనాల్లో నడిచిన గురుకులాలకు ఇప్పుడు సొంత గౌరవం దక్కుతోంది. టేకులోడు, సింహాచలం గురుకులాల్లో ఐఐటీ, నీట్ ప్రవేశాల కోసం ప్రత్యేక ఎక్సలెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇది గ్రామీణ బీసీ విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం కల్పిస్తోంది. గతంలో నిర్మాణాలు ఆగిపోయిన గుడిబండ, గుండుమల, పులివెందుల, రొద్దం గురుకులాలను మళ్లీ పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇది కేవలం భవనాల నిర్మాణం కాదు... వేలాది కుటుంబాల ఆశలకు రూపం.

## హాస్టల్ అంటే ఇక కష్టాల నిలయం కాదు...

ఒకప్పుడు ప్రభుత్వ హాస్టళ్లంటే ఇబ్బందులు, తాగునీటి సమస్యలు, మరమ్మతుల కోసం ఎదురు చూపులు గుర్తొచ్చేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారుతోంది. రాష్ట్రంలోని 998 బీసీ హాస్టళ్లలో 85వేల మంది విద్యార్థులకు మెరుగైన వసతి కల్పిస్తున్నారు. రూ.80 కోట్లతో భవనాల మరమ్మతులు, రూ.16.85 కోట్లతో 772 ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు, ఇన్వర్టర్లు, దోమతెరలు, వంట సామగ్రి, సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం... ఇవన్నీ ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం. 260 మంది కొత్త కుక్‌ల నియామకం, త్వరలో మరో 142 మంది నియామకం, 1,291 మంది పారిశుధ్య సిబ్బంది ఏర్పాటు... ఇవన్నీ విద్యార్థులు ఇంట్లో ఉన్నట్టే ఉండాలనే ఆలోచనకు ప్రతిరూపం.

## ప్రతిభకు ప్రోత్సాహం... ఉద్యోగాలకు దారి

చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం రావాలని ప్రతి యువకుడు కోరుకుంటాడు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన శిక్షణను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ప్రతి ఏటా వంద మంది బీసీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ కోచింగ్, ఉచిత వసతి, ఉచిత భోజనం కల్పిస్తోంది. కొందరు ఇప్పటికే యూపీఎస్సీ ప్రిలిమ్స్ అర్హత సాధించగా మరికొందరు బ్యాంకులు, ఆర్ఆర్‌బీ, గ్రూప్-2 వంటి ఉద్యోగాలు సాధించారు. మెగా డీఎస్సీకి ఉచిత కోచింగ్ ద్వారా 280






మంది బీసీ యువత ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం ఎంతో ప్రోత్సాహకరమైన విషయం. ఇక విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిల్లో ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేసి గ్రూప్-1, గ్రూప్-2 వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.



## ఆదరణ 3.0... చేతివృత్తులకు కొత్త జీవం

బీసీ కుటుంబాల జీవనాధారం ఎక్కువగా సంప్రదాయ వృత్తులే. కాలానుగుణంగా ఆ వృత్తులకు ఆధునిక పరికరాలు, మార్కెట్ అవకాశాలు లేక చాలామంది వెనుకబడ్డారు. ఇప్పుడు రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకం ద్వారా ఆధునిక పరికరాలు అందించి, సంప్రదాయ వృత్తులను లాభదాయకమైన వ్యాపారాలుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పెంపు, నేతన్నలకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్, వడ్డెరలకు క్వారీల్లో రాయితీలు, మత్స్యకారులకు నిషేధ కాల భృతి రెట్టింపు... ఇవన్నీ వృత్తి ఆధారిత బీసీల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకొస్తున్నాయి.

## రాజకీయాల్లో బీసీలకు పెద్దపీట

బీసీలు కేవలం ఓటు బ్యాంక్ కాదు... పాలనలో భాగస్వాములు కావాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 34శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు చేపట్టింది. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. బీసీలకు ఆత్మగౌరవం, సామాజిక రక్షణ కల్పించే బీసీ రక్షణ చట్టాన్ని రూపొందించే ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఇది అమల్లోకి వస్తే దేశంలోనే ఒక కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.

## ప్రతి జిల్లాలో బీసీ భవనం

సంఘటిత శక్తి సమాజ అభివృద్ధికి అవసరం. అందుకే ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవనాలు నిర్మిస్తున్నారు. కర్నూలు, ఏలూరు, నెల్లూరులో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హాళ్లు కూడా నిర్మిస్తున్నారు.

## కోట్లాది మందికి నేరుగా లబ్ధి

రెండేళ్లలో బీసీ కార్పొరేషన్ ద్వారా 117.68 లక్షల మంది బీసీలకు రూ.32,533 కోట్లకు పైగా ప్రయోజనాలు అందాయి. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రూ.19,429 కోట్లకు పైగా సహాయం అందింది. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కావు. లక్షలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన వాస్తవాలు.

నమ్మకం ఎందుకు పెరిగింది?
ప్రజలు మాటలు కాదు... పనులు చూస్తారు.
బడ్జెట్‌లో భారీ నిధులు...
కొత్త గురుకులాలు...
శాశ్వత భవనాలు...
ఉచిత కోచింగ్...
హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు...
ఆదరణ 3.0...
రాజకీయ రిజర్వేషన్లు...
సంప్రదాయ వృత్తులకు ఆధునిక బలం...
బీసీ రక్షణ చట్టం...

ఇవన్నీ చూస్తుంటే ఈ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటర్లుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా చూస్తోందనే భావన బలపడుతోంది. రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీలు ఇప్పుడు ఒక్కొక్కటిగా కార్యరూపం దాలుస్తున్నాయి. బీసీ పిల్లలకు నాణ్యమైన విద్య, యువతకు ఉద్యోగ అవకాశాలు, సంప్రదాయ వృత్తులకు ఆధునిక సాంకేతికత, రాజకీయాల్లో ప్రాధాన్యం, సామాజిక గౌరవం... ఇవన్నీ కలిసి ఒక కొత్త దిశను చూపిస్తున్నాయి.

ఇంకా ప్రయాణం పూర్తి కాలేదు. చేయాల్సిన పనులు ఇంకా చాలా ఉన్నాయి. కానీ మొదటి రెండేళ్లలో కనిపించిన దిశ మాత్రం స్పష్టంగా ఒక సందేశాన్ని ఇస్తోంది.

"బీసీల అభ్యున్నతి అంటేనే రాష్ట్ర అభివృద్ధి" అనే ఆలోచనతో ముందుకు సాగుతున్న ఈ ప్రయాణంపై ప్రజల్లో ఒక కొత్త నమ్మకం ఏర్పడింది. అందుకే ఈ రెండేళ్లను చాలా మంది ఒక మాటలో చెప్తున్నారు....
"2 ఏళ్ల నమ్మకం... బీసీల భవిష్యత్తుకు బంగారు బాట."

**శశికుమార్**
**తెలుగుదేశం సైనికుడు**



# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులకు జగన్ మనశ్శాంతి లేకుండా చేశాడు

## • రైతాంగానికి కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు



అనకాపల్లి (చైతన్యరథం): ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో నాడు వైసీపీ నాయకుడు జగన్ రైతులకు మనశ్శాంతి లేకుండా చేశాడని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం కోట మండలం ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదుల పాలెం, కొత్తపల్లి, బుచ్చియపేట, తాళ్లపాలెం, నరసాపురం గ్రామాలకు చెందిన 1500 రైతులకు రాజముద్రతో కూడి పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి బుద్ధా నాగజగదీశ్వరరావు రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బుద్ధా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చి రైతులకు మనశ్శాంతి లేకుండా చేశారని, వారి భూములలో సర్వే రాళ్లపై జగన్ ఫోటో పెట్టుకోవడం, పాసుపుస్తకాలపై జగన్ ఫోటో ముద్రించి ఇవ్వడంతో రైతు కుటుంబాల్లో ఆశాంతి నెలకొందన్నారు. సమగ్ర సర్వే పేరుతో ఒకరు భూమికి మరొకరికి భూమి కొలతల్లో తేడాలు వంటివి చేసి దుర్మార్గంగా వ్యవహరించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రభుత్వ రాజ్యముద్రతో పాసు పుస్తకాలు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు సురేంద్ర, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కసింకోట మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, రైతు నాయకుడు ఉగ్గిన రమణమూర్తి, పొన్నగంటి అప్పారావు, తాసిల్దార్ కార్యాలయం వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# అవగాహన కల్పించేలా యువగళం యాంటీ డ్రగ్ థీమ్ పార్క్

## ●ఆగస్టు నెలాఖరికి పార్కు సిద్ధం చేయాలి : వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్



విశాఖపట్నం (చైతన్యరథం): మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, యువత ను చైతన్యవంతం చేసేలా ప్రపంచంలోనే మొదటిసారిగా విశాఖ సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మిస్తున్న యువగళం యాంటీ డ్రగ్ థీమ్ పార్క్ అందరికి అవగాహన కల్పించేలా తీర్చిదిద్దాలని వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. శు క్రవారం ఉదయం వి.ఎం.ఆర్.డి.ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్‌తో కలిసి సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత డ్రగ్స్ బారిన పడకుండా వారిని సన్మార్గం పయనించేలా యువగళం యాంటీ డ్రగ్ థీమ్ పార్క్ వినోదం ఆహ్లాదంతో పాటు అవగాహన కలిగించేలా ఆకర్షణీయమైన రీతిలో పార్కును సిద్ధం చేయాలని సూచించారు. ఈ పార్కు విశాఖనగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఉండాలని సూచించారు. ఆకర్షణీయమైన ప్రవేశమార్గం, సంగీతం వచ్చే మెట్లు, ఎల్ ఈ డి దీపాలతో వినూత్నమైన విధంగా పార్కు అన్ని వర్గాల వారి ఆదరణ పొందేలా ఆగస్టు నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## • ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు (చైతన్యరథం): ముసునూరు మండలం, వేల్పుచర్ల గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలను మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే పరిశీలింపజేసి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రతి ఫిర్యాదుపై బాధ్యతతో వ్యవహరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం 22 మంది లబ్ధిదారులకు 11 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం : ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నాడు గుమ్మలక్ష్మీపురంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి వినతిని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజలు ధైర్యంగా తమ సమస్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే డీఆర్ఎం లలిత్ బోహ్రాతో ప్రభుత్వ విప్ గణబాబు భేటీ

## ●పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై హర్షం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) విశాఖపట్నం డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రాని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక రైల్వే సమస్యల పరిష్కారానికి మరియు తగిన మద్దతు అందించినందుకు ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బోహ్రాని ఆయన ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా 56వ వార్డు పరిధిలోని చాకలి గెడ్డ వద్ద గల అండర్‌పాస్‌లో వాక్‌వే (నడక దారి) ఏర్పాటు, వెంకటాపురం అయిదు మాదాల వద్ద నూతన రహదారి నిర్మాణం, అలాగే వెంకటాపురం జనతా కాలనీలోని ఒంటి మాదుం వద్ద రోడ్డు నిర్మాణ పనులకు రైల్వే శాఖ సహకరించడంపై విప్ గణబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇదే సమావేశంలో నియోజకవర్గ ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు వీలుగా పలు కీలకమైన నూతన రహదారి ప్రతిపాదనలను డీఆర్ఎం లలిత్ బోహ్రా దృష్టికి విప్ గణబాబు తీసుకువెళ్లారు. అందులో భాగంగా సింహాచలం రైల్వే స్టేషన్ నుండి నార్త్ సింహాచలం వెళ్లే ప్రధాన రహదారిని ప్రస్తుతమున్న 10 అడుగుల నుండి 40 అడుగుల మేర విస్తరించడంతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలో భాగంగా ఈ రహదారిని నేరుగా వెంకటాపురం ప్రాంతానికి అనుసంధానించేలా (కనెక్ట్ చేసేలా) చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అనుసంధానత వల్ల వెంకటాపురం, జనతా కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలకు రైల్వే స్టేషన్‌కు చేరుకునే మార్గం సులువవుతుందని ఆయన వివరించారు. దీనితో పాటు బాజీ జంక్షన్ నుండి సింహాచలం రైల్వే స్టేషన్ వరకు రైల్వే ట్రాక్ పక్కనే నూతనంగా రోడ్డు నిర్మించేందుకు అవసరమైన రైల్వే అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, అమృత భారత స్టేషన్ పథకంలో భాగంగా అభివృద్ధి చెందుతున్న సింహాచలం రైల్వే స్టేషన్‌లోనికి ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సులు వెళ్లేందుకు వీలుగా తగిన యాక్సెస్ కల్పించాలని, అక్కడ బస్ హాల్ట్ (స్టాప్) ఏర్పాటుకు అనుమతించాలని డీఆర్ఎంను కోరారు. గణబాబు తీసుకొచ్చిన ఈ ప్రతిపాదనలన్నింటిపై డీఆర్ఎం లలిత్ బోహ్రా సానుకూలంగా స్పందించారు. వచ్చే వారం ఇద్దరూ కలిసి క్షేత్రస్థాయి పరిశీలన (ఫీల్డ్ విజిట్) చేసి, తుది నిర్ణయం తీసుకుందామని డీఆర్ఎం హామీ ఇచ్చారు.

# విశాఖతూర్పులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి శ్రీకారం



విశాఖ తూర్పు (చైతన్యరథం): నియోజకవర్గంలోని 13వ వార్డు దారపాలెం దరి అల్లూరి సీతారామరాజు వ్యాలీ (ఎ.ఎస్.ఆర్ వ్యాలీ) కాలనీ నందు విశాఖతూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా జీవీఎంసీ నిధులు రూ.56.00 లక్షల విలువ గల కాంక్రీట్ కాలువల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులను ఉద్దేశించి వెలగపూడి మాట్లాడుతూ... కాలనీ కొత్తగా ఏర్పాటు కావడం వల్ల మీ గృహ సముదాయాల సమీపంలో ఖాళీ స్థలాలను కాంక్రీట్‌తో పూడ్చవద్దని అలా పూడిస్తే వర్షం నీరు భూమి లోపలికి ఇంకకుండా వృధాగా పోతుందని ఇప్పుడున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ కూడా ప్రతి ఇంటి సముదాయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె శివప్రసాద్, ఇంజనీరింగ్ వర్క్స్ ఈఈ గంగాధర్, డిఈ చంద్రమౌళి, ఏఈ భరత్, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పోతకంద ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, సీనియర్ నాయకులు ఎల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, ఎఎస్ఆర్.వ్యాలీ కాలనీ అధ్యక్షులు బి.ఎన్.రాజు, ఎస్.ఆర్.వి వి ప్రసాద్, నాయుడు, తోమరోతు రాజు మహిళలు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన : మంత్రి కొల్లు, గురుమూర్తి



గుడివాడ (చైతన్యరథం): నేడు గుడివాడలో జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఐఏఎస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఐఏఎస్, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

# అర్జీలను బాధ్యతతో పరిశీలించి పరిష్కరించాలి

**●దెందులూరులో చింతమనేని ప్రభాకర్ ప్రజాదర్బార్... అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే**



దెందులూరు (చైతన్యరథం): దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం దెందులూరు మండలానికి సంబంధించిన రెండవవిడత "ఒక నెల- ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, సంబంధిత శాఖ అధికారులు సంయుక్తంగా పాల్గొని ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. మొదటివారంలో వచ్చిన అర్జీలపై శాఖలు వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... సూపర్ ఎల్ నినో ప్రభావం వలన తక్కువ నీటితో ఆరుతడి పంటలు సాగుకు రైతులు మొగ్గు చూపాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్ నినో ప్రభావం ప్రపంచమంతా ఉందని, ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదు ఉన్నందున, రైతులు అధికనీటి పంటలు కాకుండా, ఆరుతడి పంటలు సాగుపై దృష్టిసారించాలని సూచించారు. రైతులు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి రైతు పరిస్థితిని అర్థంచేసుకుని తక్కువ నీటితో ఆరుతడి, అపరాలు, తదితర పంటలు వేసుకుంటే కేవలం 60, 90 రోజుల్లో పంటలు చేతికి వస్తుందని అన్నారు. ఆరుతడి పంటలు విత్తనాలు ప్రతి రైతుకు సబ్సిడీద్వారా అందించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎక్కడ త్రాగునీరుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. ఇప్పటికే ప్రతి రైతు, కౌలు రైతు ఎకరానికి నారుపోయ్యడానికి ఒక వెయ్యి రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. పదిరూపాయలు ఖర్చు పెట్టినప్పుడు నష్టంజరిగితే మిగతా తొంభై రూపాయలు నష్టపోకుండా జాగ్రత్త తీసుకోవచ్చునని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన అవగాహన కల్పించి, తగిన సూచనలు సలహాలు అందించి తక్కువ నీటితో సాగుచేయగల పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు తదితర ఆరుతడి పంటలను సాగుచేయడం ద్వారా మంచి ఆదాయం లభిస్తుందని తెలియచెప్పాలని అన్నారు. రైతులు వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ శాస్త్రీయ విధానాలను అనుసరించాలని కోరారు. సాగుప్రణాళికలను నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించుకుంటే దిగుబడులు మెరుగు పడటంతో పాటు ఆర్థిక నష్టాలను కూడా నివారించవచ్చని పేర్కొన్నారు.

# ఆంధ్ర క్రికెట్‌కు మరింత బలోపేతమైన భవిష్యత్ నిర్మాణమే లక్ష్యం

**●ఏసీఏ కార్యదర్శి, రాజ్య సభ సభ్యులు సానా సతీష్ బాబు**



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ యువతలో క్రికెట్ ప్రతిభను గుర్తించి, యువ క్రీడాకారులకు మరింత మెరుగైన అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు ఆధ్వర్యంలో విజయవాడలోని ఏసీఏ కార్యాలయంలో శుక్రవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ కళ్యాణ్ కృష్ణతో పాటు జూనియర్, సీనియర్ సెలెక్షన్ కమిటీ సభ్యులు, టాలెంట్ కమిటీ సభ్యులు, అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీఏ కార్యదర్శి, ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ... 2026–27 ఆంధ్ర క్రికెట్ సీజన్‌కు సంబంధించిన మార్గదర్శకాలు, కార్యాచరణ ప్రణాళిక, ఎంపికల విధానంపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ప్రతిభ, క్రమశిక్షణ, ప్రదర్శన ఆధారంగానే ప్రతి ఆటగాడికి అవకాశాలు కల్పించే పారదర్శక, ప్రతిభా ఆధారిత వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఏసీఏ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, యువ క్రీడాకారులకు అత్యుత్తమ అవకాశాలు కల్పించడం, నాణ్యమైన కోచింగ్, సమర్థవంతమైన ఎంపికల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్ర క్రికెట్‌కు మరింత గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. క్రికెట్ అభివృద్ధికి అవసరమైన వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ, ఆటగాళ్లకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఏసీఏ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఆంధ్ర క్రికెట్‌కు బలమైన భవిష్యత్‌ను నిర్మించాలంటే గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభను గుర్తించి, వారికి సరైన వేదికను అందించాలి. ప్రతిభకు ప్రాధాన్యం ఇచ్చే పారదర్శక వ్యవస్థతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యుత్తమ క్రికెట్ రాష్ట్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం" అని ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు.

# అతి త్వరలో అమరావతికి బుల్లెట్ ట్రైన్ : ఎంపీ కేశినేని శివనాథ్

**●డబల్ ఇంజన్ సర్కార్ పవర్‌తో ఏపీకి 75 అమృత్ భారత్ స్టేషన్లు**



ఎన్టీఆర్ జిల్లా (చైతన్యరథం): నియోజకవర్గం రాయనపాడు ప్రాంతంలో అమృత్ భారత్ పథకం కింద ఏర్పాటైన రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్ ను భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎంపి కేశినేని చిన్ని మరియు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా ఎంపీ పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన ఎంపీ కేశినేని చిన్నికి రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యక్రమంలో భాగం గా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపీ ఇచ్చింది ప్రత్యక్షంగా వీక్షించారు అనంతరం వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం స్టేషన్ లోపల ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్స్ ప్లాట్‌ఫార్మ్ ఏసీ వెయిటింగ్ హాల్స్ ను మంత్రి, ఎమ్మెల్యే రైల్వే అధికారులు, జిల్లా కలెక్టర్ తో కలిసి ఎంపీ చిన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ... డబల్ ఇంజన్ సర్కార్ పవర్ ద్వారా ఇవాళ 75 స్టేషన్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదగా ప్రారంభమవుతున్నాయని భారతదేశంలో తయారైన హైడ్రోజన్ పవర్‌తో నడిచే రైలు కూడా ఇవాళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓపెన్ చేయడమేఅన్నిటికన్నా గొప్ప విషయం అని తెలిపారు. సుమారు 1000 అమృత్ భారత్ స్టేషన్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక 72 స్టేషన్లు ఒక్కఆంధ్రప్రదేశ్‌కే వచ్చాయంటే ఆంధ్రప్రదేశ్‌కు ఎన్డీఏ గవర్నమెంట్ ఇచ్చే గౌరవం ఏంటో ప్రతి ఒక్కరికి అర్థమవుతుంది అని అన్నారు.రాయనపాడు అంటేనే రైల్వే వారి వేగన్ వర్క్ షాప్ ఇక్కడ ఉండేది. రాయనపాడు ప్రాంతంలో ఎన్నో రైల్వే లైన్లు వెళతాయి రైల్వే ఉద్యోగులు ఎక్కువగా నివసించే ప్రాంతంగా కూడా ఇదే ఈ ప్రాంతంలో ఒక అమృత్ భారత్ స్టేషన్ 25 కోట్ల రూపాయలతో ఖర్చు పెట్టి ఇవాళ ప్రారంభించడం ఇవాళ ఈ ప్రాంతానికి ఒక వన్నెతెచ్చిన విషయం అని అన్నారు. మంత్రి సహకారంతో నేను ఈ ప్రాంతంలో దాదాపు మూడు ఆర్ఓబిలు ఒక ఆర్ యు బి కూడా తీసుకొచ్చామన్నారు. అతి త్వరలో బుల్లెట్ ట్రైన్ కూడా ఈ ప్రాంతం చూడబోతుంది అని అన్నారు. ఈ అన్ని విషయాలపై సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఒక్క హెల్మెట్ లేకపోతే ఒక కుటుంబం చీలిపోతుంది! ఆలోచించండి

**●మీ ప్రమాదం... వారి కన్నీరు! హెల్మెట్ ధరించి కుటుంబాన్ని కాపాడండి**

**●మీ ప్రాణాలతో పాటు కుటుంబ భద్రత కూడా ముఖ్యం": ఎమ్మెల్యే రోషన్ కుమార్**



చింతలపూడి (చైతన్యరథం): ప్రాణ రక్షణే ప్రధానం, హెల్మెట్ ధారణే భద్రతకు మార్గమని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్లను అందజేసిన ఎమ్మెల్యే, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఒక్క వ్యక్తి మాత్రమే కాదు, మొత్తం కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. "మీ ప్రాణాలతో పాటు మీ కుటుంబ సభ్యుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని రోడ్డు భద్రతా నియమాలను పాటించండి" అని పిలుపునిచ్చారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు హెల్మెట్ ధరించి ప్రత్యేక బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా తన చింతలపూడి క్యాంపు కార్యాలయం వరకు స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ, ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సందేశం ఇచ్చారు. ప్రజా ప్రతినిధి స్వయంగా ఆచరించి చూపడంతో పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ క్రాంతి కుమార్, ఎస్ఐ సతీష్ కుమార్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన నాయకులు, హెల్మెట్ దాతలుగా వ్యవహరించిన మాజీ జడ్పీటీసీ తాళ్లూరి రాధారాణి, శాంతారెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 40 ఏళ్ల డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి అడుగులు

**● ఓఎన్‌జీసీ అధికారులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కీలక చర్చలు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగర పరిధిలోని తారకరామనగర్, శ్రీరామపురం రోడ్డు, పోలీస్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) కీలక చర్యలు చేపట్టారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఓఎన్‌జీసీ అసెట్ మేనేజర్ హేమంత్ ముల్లాను కలిసి ప్రతిపాదిత డ్రైనేజీ ప్రణాళికను స్కెచ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తారకరామనగర్, శ్రీరామపురం తదితర ప్రాంతాల్లో గత 30--40 సంవత్సరాలుగా సరైన ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు వెళ్లే దారి లేక అలాగే వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణం అత్యవసరమని వివరించారు. ప్రతిపాదిత డ్రైనేజీ మార్గంలో అవసరమైన స్థలం ఓఎన్‌జీసీ పరిధిలో ఉండటంతో, ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ స్థలాన్ని కేటాయించాలని ఓఎన్‌జీసీ అధికారులను కోరారు. ప్రధాన డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే తారకరామనగర్, శ్రీరామపురం రోడ్డుతో పాటు పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీరు సులభంగా హైవే మీదుగా విద్యుత్ కాలనీ వైపు మళ్లించే అవకాశం ఉంటుందని వివరించారు. ముందుగా ప్రధాన డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేసి, అనంతరం ఆయా కాలనీల్లో అంతర్గత డ్రైనేజీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కనిగిరిలో దివ్యాంగులకు ఘనంగా సహాయ పరికరాల పంపిణీ

కనిగిరి (చైతన్యరథం): కనిగిరి నియోజకవర్గంలో ALIMCO సహకారంతో నిర్వహించిన ADIP క్యాంప్ (2024--2025) ద్వారా ఎంపికైన దివ్యాంగ లబ్ధిదారులకు సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి మరియు కనిగిరి శాసనసభ్యులు, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, ఋావీ కిట్లు, బ్రెయిల్ కిట్లు, వాకింగ్ స్టిక్స్ తదితర సహాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం రూ.52,17,029 విలువైన సహాయ పరికరాలు అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు అందజేశారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారికి స్వావలంబన కల్పించడం, సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం ద్వారా ఈ సహాయ పరికరాలను అందిచామని తెలిపారు.

## ప్రజాదర్బార్‌కు విశేష స్పందన... ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

**●వినతులు స్వీకరించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో నిర్వహించిన "ప్రజాదర్బార్" కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...**

ప్రజాదర్బార్ ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత విశ్వసనీయ వేదికగా మారిందన్నారు. గత ఏడాదిన్నర కాలంగా వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపామని తెలిపారు. పరిష్కారం ఆలస్యమయ్యే సమస్యల విషయంలో కూడా ప్రజలకు పూర్తి సమాచారం అందిస్తూ ఎమ్మెల్యే కార్యాలయం జవాబుదారీతనంతో పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు రూ.12 కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు అందించామని తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. "

**విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ...**

విజయవాడ నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అత్యంత వేగంగా ప్రజలకు చేరవేస్తున్న ఘనత ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుదేనని ప్రశంసించారు. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 6 గంటలకల్లా రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ అయ్యేలా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. విజయవాడలోనే అత్యంత బలమైన పార్టీ క్యాడర్ సెంట్రల్ నియోజకవర్గంలో ఉందని, కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారికి అన్నలా అండగా నిలుస్తున్న నాయకుడు బొండా ఉమామహేశ్వరరావుని కొనియాడారు.

## విజయవాడ తూర్పులో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**● ఎంపీతో కలిసి శంకుస్థాప కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 2,3,4,5 డివిజన్లలో రోడ్డు పనులకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మరియు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ కలిసి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... విజయవాడ తూర్పు నియోజకవర్గంలో రూ. 14కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని రోడ్లు వేసిన డ్రైనేజీ పనులు చేసిన ఇతర అభివృద్ధి పనులు ఏది చేయాలన్న ఆ పనులు జరగాలన్న ఒక్క తెలుగుదేశం మరియు కూటమి ప్రభుత్వంలోనేనని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరు చేసే విధంగా ఎప్పటికప్పుడు నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉన్నామని తెలిపారు. కొండ ప్రాంతంలో ఉన్న ప్రజలకు త్వరలో గొప్ప శుభవార్త చెప్పబోతున్నామని కొండ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు త్వరలో ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ చేయబోతున్నామని దీని ద్వారా ఎంతోమంది కొండ ప్రాంత ప్రజలకు మేలు జరగబోతుందని వారి చిరకాల కోరిక తీర్చిన ప్రభుత్వంగా కూటమి సర్కార్ నిలుస్తుందని అన్నారు.

## నీట్ యూజీ 2026 ఫలితాల్లో ర్యాంకు సాధించిన దుష్యంత్‌ను అభినందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట (చైతన్యరథం): ఇటీవల విడుదలైన NEET-UG 2026 ఫలితాల్లో జగ్గయ్యపేట పట్టణం మార్కండేయ బజార్ 18వ వార్డుకు చెందిన వడ్డేపల్లి శ్రీనివాసరావు కుమారుడు వడ్డేపల్లి దుష్యంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 126వ ర్యాంకు, కేటగిరీ ర్యాంకు 24 సాధించడంతో పాటు 720 మార్కులకు గాను 690 మార్కులు సాధించి జగ్గయ్యపేటకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గురుధామ్‌లో గురువు ఆశీస్సులు అందుకున్న అనంతరం, జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్, శ్రీరాం చిన్నబాబు దుష్యంత్‌ను శాలువాతో సత్కరించి, అభినందించారు. వడ్డేపల్లి దుష్యంత్ సాధించిన ఈ అపూర్వ విజయం జగ్గయ్యపేట నియోజకవర్గానికే గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఉంటే అత్యున్నత విజయాలు సాధించవచ్చుని దుష్యంత్ నిరూపించారని అన్నారు.

## భారీ రుణ వితరణ... ఎన్డీయే ప్రభుత్వ మరో గొప్ప ఆర్థిక సంస్కరణ

**● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన రుణ పంపిణీతో దేశ ఆర్థిక ప్రగతిలో వేగం పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): "ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా శుక్రవారం పల్నాడు జిల్లాలో జరిగిన భారీ రుణ వితరణ కార్యక్రమం దేశ ఆర్థిక ప్రగతిలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. 1,03,246 మందికి రూ.3,216 కోట్ల రుణ పంపిణీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి, కుల వృత్తులు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత ఆర్థిక భద్రతకు గొప్ప భరోసానిచ్చాయి అనడం అతిశయోక్తి కాదు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో కేంద్రం పేద, సామాన్య వర్గాల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా చేపట్టిన మరో గొప్ప ఆర్థిక సంస్కరణ ఈ రుణాల పంపిణీ. స్వయం ఉపాధికి ప్రోత్సాహన్నివ్వడంతో పాటు.. ఉపాధి అవకాశాల పెరుగుదల, ఆర్థిక వృద్ధికి తోడ్పడే విప్లవాత్మక సామాజిక కార్యక్రమం ఈ రుణ పంపిణీ. రుణాల ద్వారా పెట్టుబడులు పెరిగి, ఉత్పత్తి, వినియోగం, ఎగుమతులు ఊపందుకోవడంతో దేశ జీడీపీ మునుపటి కంటే మెరుగ్గా వృద్ధి చెందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపుతో ఇప్పటివరకు బ్యాంకుల సేవలకు నోచుకోని అనేక వర్గాలకు ఇకపై అధికారిక బ్యాంకింగ్ సేవలు వేగంగా, సరళంగా అందుబాటులోకి రానున్నాయి.

**మోదీ చేయూత, చంద్రబాబు సహకారంతో ఆర్థిక రంగంలో అద్భుత ఫలితాలు..**

ఎమ్.ఎస్.ఎమ్.ఈ, వ్యవసాయాభివృద్ధి, మహిళలు, నిరుద్యోగ యువత ఆర్థిక సాధికారతకు మోదీ అందిస్తున్న చేయూత, చంద్రబాబు సహకారంతో భారత ఆర్థిక రంగం భవిష్యత్‌లో అద్భుత ఫలితాలు సాధించబోతోంది. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న కూటమిప్రభుత్వ లక్ష్యసాధనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినూత్న ఆలోచనలు, విశాల దృక్పథంతో గ్రామీణాభివృద్ధి పాటు, విస్తృత ఉపాధి అవకాశాలకు దారి చూపుతాయి." అని ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

## ప్రజాహితమే ప్రజాదర్బార్ లక్ష్యం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి జీవనోపాధి మెరుగుపరచడమే ప్రజా దర్బార్ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని స్థానిక తూర్పు కార్యాలయంలో నిర్వహించారు. అన్ని డివిజన్లలో సమస్యలను స్వయంగా ఆలకించారు. శానిటేషన్, విద్యుత్ సరఫరా, రోడ్లు వంటి అవసరాల గురించి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొందరు జీవనోపాధి కల్పించాలని అర్జీలు అందజేశారు. వారికి అవసరమైన ఆర్థిక శక్తి అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్లో అందించిన సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామన్నారు.

## ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): వీరులపాడు మండలం వి. అన్నవరం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నాయకులతో కలిసి పాల్గొని గ్రామ ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజా పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు గ్రామాలకు వచ్చి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులో పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని, ప్రజలకు జవాబుదారీతనంతో సేవలందించడం ప్రతి అధికారికి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ , వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీమంత్రి నక్కా ఆనందబాబు నేడు వేమూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం, వేమూరు గ్రామంలో నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 60 మంది ప్రజల వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్య సేవలు, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి, అర్హమైన ప్రతి సమస్యకు ప్రాధాన్యతనిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజలకు చేరే విధంగా "మీకోసం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేమూరు మండలానికి చెందిన కూటమి ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# తీరిన మూడు తరాల రైతుల కష్టాలు... రాజముద్రతో 322 పాసు పుస్తకాల పంపిణీ

**●పోతిరెడ్డిపాళెంలో రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



కోవూరు (చైతన్యరథం): రైతు భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేస్తున్నామని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. శుక్రవారం కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్‌ని ప్రారంభించి, అనంతరం 322 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ... పోతిరెడ్డిపాళెంలో మూడు తరాలుగా కొందరు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. డెల్టా ప్రాంతంలో, నెల్లూరుకు సమీపంలో ఉన్న గ్రామంలో ఇలాంటి సమస్యలు ఇన్నేళ్లుగా కొనసాగినా గత ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు సహకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి, రైతుల హక్కులను కాపాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా సుమారు 140 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు భరోసా**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ చట్టాన్ని రద్దు చేసి రైతులకు కొండంత భరోసా కల్పించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, ఈ నెల 22న 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు.

**రూ.770 కోట్లతో కోవూరు అభివృద్ధి**

గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే తెలిపారు. యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామీణాభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. వీరి సహకారంతోనే కేవలం రెండేళ్లలో కోవూరు నియోజకవర్గంలో సుమారు రూ.770 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. అలాగే CMRF ద్వారా కోవూరు నియోజకవర్గంలో దాదాపు వెయ్యి మందికి రూ.10 కోట్లకు చేరువైన ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

**వీపీఆర్ నేత్ర సేవలను వినియోగించుకోవాలి**

వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పోతిరెడ్డిపాళెంలో కార్యక్రమం పూర్తయిందని, ప్రస్తుతం చుండుగుంటలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా అందజేస్తున్నామని చెప్పారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**●అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాం**

**●చెప్పిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాం**

**●త్వరలో వెలిగొండ నుంచి నీళ్లు అందిస్తాం : మంత్రి డోలా**



మార్కాపురం (చైతన్యరథం): హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం త్రిపురాంతకంలోని శ్రీ బాలత్రిపుర సుందరిదేవి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి డా. స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య తో కలిసి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆలయ కమిటీ సభ్యుల చేత మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...వైసీపీ హయాంలో హిందూ దేవాలయాల్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కాసుల కక్కుర్తితో తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించామని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తామన్నారు. గత ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారన్నారు. నాడు జగన్ వెలిగొండ పూర్తిగా కాకుండానే జాతికి అంకితం చేసి జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వెలిగొండ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలో వెలిగొండ నుంచి నీళ్లు అందించి ఈ ప్రాంతాన్ని అంతా సస్యశ్యామలం చేస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు.

# గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు గిద్దలూరులో హాల్ట్ కల్పించాలి : ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజలకు కీలకమైన కంభం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఆధునికీకరించేందుకు చేపట్టిన పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మేనేజర్ సుదర్శనా సేన్‌తో కలిసి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించిన పెండింగ్ రైల్వే సమస్యలను ఎంపీ, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ క్రింది ప్రధాన డిమాండ్లను వినిపించారు. గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు గిద్దలూరులో హాల్ట్ కల్పించాలి. రేణిగుంట--నంద్యాల రైలును గిద్దలూరు వరకు పొడిగించాలి. గిద్దలూరు--గుంటూరు, గిద్దలూరు--నంద్యాల మధ్య పగటి వేళల్లో కొత్త రైలు సర్వీసులు ప్రారంభించాలి. తెనాలి--మార్కాపురం రోడ్ రైలును గిద్దలూరు లేదా నంద్యాల వరకు పొడిగించాలి. గిద్దలూరు స్టేషన్‌లో కోచ్ పొజిషన్ డిస్‌ప్లే సిస్టమ్ ఏర్పాటు చేయాలి. నల్లబండ బజార్--రాచర్ల రోడ్డులో మూసివేసిన రైల్వే గేటును వెంటనే తిరిగి తెరవాలి. దిగువమెట్ట స్టేషన్‌లో ప్రతి రైలుకు తాగునీరు నింపేలా చర్యలు తీసుకోవాలి. గిద్దలూరు మీదుగా చెన్నైకి కొత్త రైలు సర్వీస్ ప్రారంభించాలి. గిద్దలూరు స్టేషన్‌లో ప్రయాణికుల కోసం చెల్లింపు వెయిటింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి. గిద్దలూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలి. కంభం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలి. ఈ అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రైల్వే అధికారులను కోరారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**●చీరాల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కార్యకర్తలకు ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య సూచన**



చీరాల (చైతన్యరథం): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం చీరాలలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మనమందరం కలిసి చీరాలను మరింత ప్రగతి పథంలో నడిపిద్దామని, గత ప్రభుత్వం కంటే మెరుగ్గా ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ప్రతి బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్ రోజుకు కనీసం ఒక గంట సమయాన్ని పార్టీ అభివృద్ధి పనులకు కేటాయించాలని, నియోజకవర్గ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తే, తిరుగులేని శక్తిగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు లలిత, పట్టణ అధ్యక్షులు దిగుబర్తి సురేష్, పందిళ్ళపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు పల్లబ్రోలు శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పోలకం శేఖర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ హోదాలో ఉన్న నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**●ప్రజాదర్బార్‌లో అర్జీల వెల్లువ... ప్రతి వినతికి గడువులోపు పరిష్కారం**

**●ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



నెల్లూరు (చైతన్యరథం): ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరు వేదాయపాళెంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించి వారి సమస్యలను ఓపికగా విన్నారు. తాగునీరు, భూములు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, విద్యుత్, రహదారులు తదితర సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే, పలు అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా ప్రత్యేక వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని, ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం... క్యాడర్‌తో సమన్వయమే పార్టీ బలోపేతానికి బలం : బొడ్డు వెంకటరమణ చౌదరి



రాజానగరం (చైతన్యరథం): బూరుగుపూడి గేట్ వద్ద గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమం మరియు క్యాడర్ మీటింగ్‌లో రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గానికి చెందిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి వారి సమస్యలు, వినతులు, అభిప్రాయాలను ఓర్పుగా ఆలకించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం నిర్వహించిన క్యాడర్ సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాల విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడం, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## ఉమ్మడి జిల్లాలో తొలి వసతి గృహం మనమే పూర్తి చేశాం

- విద్య, భోజనం, భవనాలు అన్నింటా నాణ్యతే.. నారా లోకేష్ లక్ష్యం
- ఆత్మకూరు జూనియర్ కళాశాల భవనాల ప్రారంభోత్సవంలో పరిటాల సునీత
- ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం



రాప్తాడు (చైతన్యరథం): ఉమ్మడి జిల్లాలో తొలి వసతి గృహాన్ని మనమే పూర్తి చేశామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవనాలను ఆమె ప్రారంభించారు. దీంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. టపాసులు కాలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్నారు. ముందుగా ఆత్మకూరు మండల కేంద్రంలో 56 లక్షల ఎన్.హెచ్.ఎం నిధులతో నిర్మించబోవు పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆమె కస్తూరిబా జూనియర్ కళాశాలకు వెళ్లగా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సునీతకు ఆత్మీయ స్వాగతం పలికారు. అక్కడ 2కోట్ల 12లక్షల రూపాయల ఏ.డబ్ల్యు.పీ నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. కళాశాల నూతన భవనాలను పరిశీలిస్తూ.. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం భోజనశాలను సందర్శించి భోజనం రుచి, నాణ్యతను చూశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల వసతి గృహాల నిర్మాణం జరుగుతున్నప్పటికీ ముందుగా పూర్తి చేసింది మాత్రం మనమేనన్నారు. ఆత్మకూరులో ప్రారంభమైన వసతి గృహం.. కూటమి ప్రభుత్వంలో తొలి భవనంగా నిలిచిందన్నారు. విద్యాసంస్థల్లో ఏ పని జరిగినా నాణ్యతగా ఉండాలన్నదే మంత్రి నారా లోకేష్ లక్ష్యం అన్నారు. విద్య అయినా, భవనాలైనా, భోజనమైనా ఏదైనా సరే క్వాలిటీ ముఖ్యమన్నారు. పిల్లలు ఇబ్బంది పడకూడదని సోలార్ హీటర్స్ కూడా పెట్టించారన్నారు. దొడ్డ బియ్యం స్థానంలో సన్న బియ్యం తీసుకొచ్చారన్నారు. గతంలో జగన్ రెడ్డి పిల్లలకు అందించే పుస్తకాలు, బ్యాగులు, చివరకు తిండి పదార్థాల మీద కూడా తన పేరు, ఫోటోలు వేయించుకున్నారన్నారు. మంత్రి లోకేష్ వీటికి స్వస్తి పలికి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల ఫోటోలతో వాటిని పంపిణీ చేస్తున్నారన్నారు. 22వ తేదీ నుంచి డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, ప్రముఖులు, రాజకీయ నేతల నుంచి పాఠశాల అభివృద్ధికి విరాళాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. పాఠశాలకు సాయం చేస్తే.. ఐటీ మినహాయింపు కూడా ఉంటుందన్నారు. ఆత్మకూరు మండలంలో ఈ రెండేళ్లలోనే సుమారుగా 60 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని.. ఇందులో రోడ్లు, పలు భవనాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం ఉందన్నారు. ముఖ్యంగా 3కోట్ల 27లక్షలతో మదిగుబ్బ - పి.కొత్తపల్లి రోడ్డు, 2కోట్ల 19లక్షలతో ఆత్మకూరు-- కురుకులపల్లి రోడ్డు, 35 కోట్లతో తాగునీటి కొరకు సీపీడబ్ల్యూస్ పథకం కింద పనులు, 6కోట్ల 60లక్షలతో గొరిదిండ్ల, తోపుదుర్తి 33/11 KV సబ్ స్టేషన్ల నిర్మాణం చేసినట్టు వివరించారు...

### ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సునీత ఫోకస్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ముందుకు సాగుతున్నారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను ఓపిగ్గా వింటూ.. కొన్నింటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, పింఛన్లు, కమ్యూనిటీ భవనాలు, గ్రామ పంచాయతీలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి కచ్చితమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ విషయాల మీద బాధితులకు స్పష్టతనివ్వాలన్నారు. ఎవర్నీ పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## ఒకే వేదికపై సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే పులివర్తి



చంద్రగిరి (చైతన్యరథం): ఒకే వేదికపై సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని వ్యాఖ్యానించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమికి ప్రభుత్వం రాకతో ప్రజల సమస్యలను ఒకే వేదికపై తీర్చే ప్రయత్నంలో భాగంగానే ప్రజా దర్బార్ నిర్వహిస్తుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు. చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులతో సమన్వయం చేస్తామన్నారు. రెవెన్యూ సంబంధిత కోర్టు కేసులను న్యాయస్థానం ద్వారానే పరిష్కరించుకోవాలని అర్జీదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఎమ్మెల్యే ప్రజా గ్రీవెన్స్

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): ప్రజల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఓడి చెరువు మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చేందుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. తాగునీరు, రహదారులు, రెవిన్యూ, విద్యుత్, ఉపాధి హామీలో పండ్ల మొక్కల పెంపకం బిల్లులు, ఇల్లు, పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, ఆస్తి తగాదాలు, మరియు ఇతర స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... "ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఈ ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు.

## ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు (చైతన్యరథం): ప్రజలు నుంచి అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్‌లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సందర్భంగా అర్జీదారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే నిర్వహించాలని ఏపీఎస్ ఆర్టీసీ జేఏసీ తరపున వినతిపత్రం సమర్పించారు. సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం, ఇతరత్రా సమస్యలపై కాలనీవాసులు, పలు సంఘాలు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా షణ్ముగం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, పరిశీలకులు పురిమిట్ల కుమారి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కాలవ



రాయదుర్గం (చైతన్యరథం): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం రూరల్ మండల పరిధిలోని బి.ఎన్.హళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాయదుర్గం నియోజకవర్గంలో గత రెండేళ్లలో 34 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు రూ.7.61 కోట్లతో సొంత భవనాల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్, నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ భవనాల నిర్మాణం జరుగుతోందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజలకు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు స్థానికంగానే చికిత్స, వైద్య సలహాలు, సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రతి చిన్న సమస్యకూ రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం తగ్గి, ప్రజలకు సమయం, వ్యయం ఆదా అవుతుందన్నారు. పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు గ్రామస్థాయిలోనే అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇటువంటి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి జరుగుతోందన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదాలు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, కేంచానపల్లి ఎర్రిస్వామి, సిద్దప్ప, బానేపల్లి అశోక్, మద్దానప్ప, మల్లేశప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ఎమ్మెల్యే బగ్గు కృషి



నరసన్నపేట (చైతన్యరథం) ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నడుచుకుంటుందని నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన స్పష్టం చేశారు. శుక్రవారం పోలాకి మండలం, కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విస్తృత స్థాయిలో "ప్రజాదర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల, నలుమూలల వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజా దర్బార్‌కు మొత్తం 44 ప్రధాన వినతులను ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వినతులలోని ప్రధాన సమస్యలు – అర్జీలలో అత్యధికంగా ప్రాథమిక అవసరాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రతా పింఛన్లు, గృహ నిర్మాణాలు, ఇళ్ల స్థలాలు, సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు, రహదారుల పునర్నిర్మాణం, గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం, ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న గుంతలమయమైన రోడ్లకు తక్షణమే ప్యాచ్ వర్కులు మరియు తారు రోడ్లు మొదలైన వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్‌లో అందిన వినతులపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తక్షణమే స్పందించారు. అర్జీల తీవ్రతను బట్టి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకతీతంగా పింఛన్లు, గృహ వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అమెరికా బ్యాడ్మింటన్‌లో మెరిసిన తెలుగు తేజం

## జూనియర్ నేషనల్ ఛాంపియన్‌గా అట్లాంటాకు చెందిన తెలుగు బాలిక ధృతి రావు

## అండర్-13 సింగిల్స్ విభాగంలో స్వర్ణ పతకం, డబుల్స్ విభాగంలో రజత పతకం కైవసం



**అట్లాంటా:** అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటాకు చెందిన తెలుగు బాలిక ధృతి రావు అంతర్జాతీయ వేదికపై మెరిసింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన '2026 యోనెక్స్ యూఎస్ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్'లో ఆమె అద్భుత విజయాలను నమోదు చేసింది. కాన్సాస్ రాష్ట్రంలోని విచితా నగరంలో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు హోరాహోరీగా జరిగిన పోటీల్లో అండర్-13 బాలికల సింగిల్స్ విభాగంలో ధృతి రావు స్వర్ణ పతకం కైవసం చేసుకుని 'నేషనల్ ఛాంపియన్'గా అవతరించింది.

ఈ టోర్నమెంట్లో ధృతి కేవలం సింగిల్స్‌కే పరిమితం కాకుండా ముప్పేట విజృంభించింది. బాలికల అండర్-13 డబుల్స్ విభాగంలో రజత పతకం సాధించడంతో పాటు అండర్-13 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచింది. ఇలా ఒకే టోర్నమెంట్‌లో మూడు వేర్వేరు విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచి అందరి దృష్టినీ ఆకర్షించింది. చిన్న వయసులోనే ఇలాంటి అద్భుత విజయాలు సాధించడం ఆమె అసాధారణ ప్రతిభకు నిదర్శనమని క్రీడా విశ్లేషకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

### పట్టుదలే విజయ రహస్యం: తల్లిదండ్రులు

అట్లాంటాలోని ప్రముఖ 'ఫోర్టియస్' బ్యాడ్మింటన్ క్లబ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ధృతి.. క్రమశిక్షణతో కూడిన సాధన, పట్టుదల, అంకితభావం వల్లే ఈ అరుదైన విజయాన్ని అందుకుందని ఆమె తల్లిదండ్రులు రవి రావు, సంధ్య గర్వంగా చెప్పారు. ఫోర్టియస్ క్లబ్‌లోని కోచ్‌లు, శిక్షణా బృందం, సహచర క్రీడాకారులు అందించిన ప్రోత్సాహం ఆమె విజయ ప్రయాణంలో కీలక పాత్ర పోషించాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో స్వర్ణ, రజత పతకాలతో మెరిసిన తెలుగు బాలిక ధృతి రావుపై ప్రస్తుతం ప్రవాస తెలుగు సమాజం హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతోంది.





# సెయింట్ లూయిస్‌లో భక్తి పారవశ్యం

## రెండో రోజుకు శత చండీ సహిత రుద్ర యాగం



**సెయింట్ లూయిస్:** అమెరికాలోని మిస్సోరి రాష్ట్రం సెయింట్ లూయిస్ హిందూ దేవాలయంలో అడుగడుగునా భక్తి పారవశ్యం కనిపిస్తోంది. నవకుండాత్మక శతచండీ సహిత రుద్రయాగం రెండో రోజు భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ఆలయ యాగశాల భక్తులతో కిక్కిరిసిపోగా వైదిక సంప్రదాయాల ప్రకారం క్రతువులను ఘనంగా నిర్వహించారు.

ఉదయం గోమాత పూజతో యాగం ప్రారంభమైంది. ఋత్విక్కులు శాస్త్రోక్తంగా మహాన్యాస పారాయణం చేశారు. అనంతరం లోక క్షేమం, సర్వజన సుఖశాంతి కోసం రుద్ర హోమం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన మోదక హోమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విఘ్నేశ్వరుడికి ప్రీతికరమైన ఈ హోమం కోసం ఆలయ వాలంటీర్లు భక్తిశ్రద్ధలతో పదివేల మోదకాలను స్వయంగా సిద్ధం చేశారు. సాయంత్రం ఆదిపరాశక్తి అనుగ్రహం, ధర్మరక్షణ కోసం చండీ హోమం నిర్వహించారు. ఆ తర్వాత వేదపండితుల మంత్రోచ్చారణలతో వారాహి హోమం శాస్త్రోక్తంగా జరిగింది. మహా యాగంలో భాగంగా ప్రతిరోజూ విశిష్ట పూజలు, హోమాలు, చండీ పారాయణ, రుద్ర యాగాలను 30 మందికి పైగా ఋత్విక్కులు నిర్విఘ్నంగా జరిపిస్తున్నారు. ప్రపంచ శాంతి, సర్వజన సుఖ శాంతి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, కుటుంబ శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న ఈ మహా యాగంలో అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొంటున్నారని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగవరపు రజనీకాంత్, ఉపాధ్యక్షుడు విజయ్ సాక్షి, కార్యదర్శి జంగా కిషోర్ తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారితో పాటు పరమేశ్వరుని అనుగ్రహం పొందాలని మీడియా వ్యవహారాల సమన్వయకర్త రాజా సూరపనేని కోరారు.





# ఒమన్‌లో ప్రవాస ఉద్యోగులకు భారీ ఊరట

## ఈ నెల 19 నుంచి సరికొత్త రూల్స్

**మస్కట్:** ఒమన్ సుల్తానేట్‌లో ఉద్యోగాలు చేస్తున్న వివిధ దేశాల వలస కార్మికులకు (నాన్-ఒమానీ ఉద్యోగులు) అక్కడి ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్త అందించింది. ఒమన్‌లో పని చేస్తున్న నాన్-ఒమానీ ఉద్యోగులందరికీ సిక్ లీవ్, అసాధారణ సెలవుల బీమాను తప్పనిసరి చేస్తూ 'సోషల్ ప్రొటెక్షన్ ఫండ్' పేరిట సరికొత్త చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సవరించిన నూతన నిబంధనలు ఈ నెల 19వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అధికారికంగా అమలులోకి రానున్నాయి.

'ఆర్టికల్-1' ప్రకారం... రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలోని అన్ని ప్రభుత్వ విభాగాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థలు, కార్మిక చట్టం పరిధిలోకి వచ్చే అన్ని ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేసే నాన్-ఒమానీ ఉద్యోగులందరికీ ఈ నయా బీమా రక్షణ తప్పనిసరిగా వర్తిస్తుంది. రాయల్ డిక్రీ (52/ 2023) ద్వారా ఈ సామాజిక భద్రతా చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారు. 'ఆర్టికల్-2' ప్రకారం... ఈ తాజా నిర్ణయానికి విరుద్ధంగా ఉన్న పాత నిబంధనలు లేదా గత ఉత్తర్వులన్నింటినీ తక్షణం రద్దు చేస్తున్నట్టు బోర్డు స్పష్టం చేసింది.

ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులపై ఒమన్ ఇంధన, ఖనిజాల శాఖ మంత్రి, సోషల్ ప్రొటెక్షన్ ఫండ్ బోర్డు ఛైర్మన్ ఇంజినీర్ సలీమ్ బిన్ నాసర్ బిన్ సయీద్ అల్ ఔఫీ సంతకం చేశారు.

# సౌదీ అరేబియా సరికొత్త 'వీసా ప్యాకేజీ'

## భారతీయులకు బంపర్ ఆఫర్

**సౌదీ:** విదేశీ పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించడమే లక్ష్యంగా సౌదీ అరేబియా సరికొత్త 'వీసా ప్యాకేజీ' సేవలను ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పర్యాటకులు వీసా కోసం విడిగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఒకే ప్యాకేజీ కింద అన్ని సదుపాయాలను పొందవచ్చు. తొలి దశలో భారత్, జోర్డాన్, ఈజిప్ట్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, మెక్సికో దేశాల పౌరులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు సౌదీ పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

**ఆల్-ఇన్-వన్ ప్యాకేజీ:** ఈ పథకం ద్వారా విమాన టికెట్, లైసెన్స్ పొందిన హోటల్ బుకింగ్, ఎలక్ట్రానిక్ టూరిస్ట్ వీసా అన్నింటినీ ఒకే ప్యాకేజీగా బుక్ చేసుకోవచ్చు. అధికారిక ట్రావెల్ ఏజెన్సీ ద్వారా ప్యాకేజీని బుక్ చేసి ఆన్‌లైన్ పేమెంట్ పూర్తి చేసిన తర్వాత గరిష్టంగా 48 గంటల్లో ఈ-టూరిస్ట్ వీసా జారీ అవుతుంది. వీసా కోసం సౌదీ రాయబార కార్యాలయాన్ని సందర్శించాల్సిన అవసరం లేదు. వీసాతో పాటు ట్రావెల్ ఇన్సూరెన్స్, ఇతర ప్రయాణ పత్రాలన్నీ నేరుగా ఈ-మెయిల్ ద్వారా అందుతాయి.

**అధికారిక ఏజెన్సీలు:** ప్రస్తుతం రిజర్వల్ (Reserval), అల్మోస్ఫార్ (Almosafer) అనే రెండు ట్రావెల్ ఏజెన్సీలకు మాత్రమే ఈ సేవలు



అందించేందుకు అనుమతి లభించింది.

**వీసా నిబంధనలు, ధరల వివరాలు**

**వ్యాలిడిటీ:** ఈ ప్యాకేజీ కింద జారీ చేసే టూరిస్ట్ వీసా సింగిల్ ఎంట్రీ వీసా. ఇది మూడు నెలలు చెల్లుబాటులో ఉంటుంది.

**సమయ పరిమితి:** సౌదీలో కనీసం రెండు రోజులు, గరిష్టంగా 88 రోజుల వరకు ఉండవచ్చు. ఒకవేళ ప్రయాణ ప్యాకేజీని రద్దు చేసుకుంటే వీసా కూడా ఆటోమేటిక్‌గా రద్దవుతుంది.

**షరతులు:** ప్యాకేజీలో తప్పనిసరిగా రిటర్న్ విమాన టికెట్, పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన కనీసం 4స్టార్ హోటల్ బుకింగ్, ఈ-వీసా దరఖాస్తు ఉండాలి. తొలి రెండు రోజుల ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి 4,000 సౌదీ రియాల్స్‌గా నిర్ణయించారు. అదనంగా ఉండే ప్రతి రోజుకు 1,000 రియాల్స్ చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

**ఉమ్రా సేవలు, ఇతర వివరాలు**

ఈ ప్యాకేజీలో మక్కా, మదీనా నగరాల్లో ఉమ్రా సేవలు ఉండవని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే ఈ వీసాతో సౌదీలోకి ప్రవేశించిన తర్వాత మక్కా, మదీనా సహా దేశంలోని అన్ని ప్రాంతాలకు ప్రయాణించేందుకు అనుమతి ఉంటుంది. ఈ ప్యాకేజీలో ఈవెంట్ టికెట్లు, వినోద కార్యక్రమాలు వంటి అదనపు సేవలను కూడా అవసరానికి అనుగుణంగా జోడించుకోవచ్చు. విమాన సర్వీసులు లేదా హోటల్ బుకింగ్ అనివార్య కారణాలతో రద్దయితే రిఫండ్, బుకింగ్ మార్పులు సంబంధిత ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్ నిబంధనల ప్రకారం జరుగుతాయి. రాబోయే రోజుల్లో మరిన్ని దేశాల పౌరులకు కూడా ఈ వీసా ప్యాకేజీ సేవలను విస్తరిస్తామని సౌదీ పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.




## అంతరిక్షంలోకి ప్రధాని మోదీ పోస్ట్‌కార్డ్

స్కైరూట్ సంస్థ శనివారం 'మిషన్ ఆగమన్' పేరిట రాకెట్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనున్న 'విక్రమ్-1' రాకెట్ సాంకేతిక పరికరాలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా తన చేతులతో రాసిన ఓ పోస్ట్‌కార్డును కూడా అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది.ప్రధాని మోదీ ఆ పోస్ట్‌కార్డుపై 'వందేమాతరం' అని రాశారు. ఈ రాకెట్‌లో ప్రధాని మోదీ రాసిన పోస్ట్‌కార్డు మాత్రమే కాకుండా.. ఇస్రోకు చెందిన ప్రస్తుత, మాజీ చైర్మన్లు.. భారతీయ వ్యోమగాములు,స్కైరూట్ బృందం,ఇన్వెస్టర్లు, విధానరూపకర్తలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రేయోభిలాషులు రాసిన వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులు కూడా అంతరిక్షంలోకి వెళ్లనున్నాయి.

భారత గడ్డపై నుంచి అంతరిక్ష కక్ష్యలోకి వెళుతున్న మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 కావటం విశేషం. ఇది దాదాపు 7అంతస్తుల భవనం అంత ఎత్తు ఉంటుంది. పూర్తిగా కార్బన్ కాంపోజిట్‌తో తయారు చేసిన ఈ రాకెట్ ఇంజన్లను 3డీ-ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా తయారు చేశారు. ఇది భూమికి దగ్గరగా ఉండే కక్ష్యలోకి 350 కేజీల బరువును తీసుకెళ్లగలదు. 2022 నవంబర్ నెలలో స్కైరూట్ సంస్థ 'విక్రమ్-ఎస్' అనే చిన్న రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఇప్పుడు పూర్తి స్థాయి ఉపగ్రహాలను మోసుకెళ్లే 'విక్రమ్-1'తో సరికొత్త చరిత్ర సృష్టించడానికి సిద్ధమైంది.

### ఆ ముగ్గురు గ్రేట్ సైంటిస్టులకు ఘన నివాళి..

విక్రమ్-1 రాకెట్ ద్వారా సాంకేతిక పరికరాలు, పోస్టు కార్డులు మాత్రమే కాదు.. మైక్రో-ఆర్ట్‌ను కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు. భారతదేశానికి చెందిన ముగ్గురు గొప్ప సైంటిస్టులు.. సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ విగ్రహాలను స్కైరూట్‌సంస్థ అంతరిక్షంలోకి పంపనుంది. మైక్రో ఆర్టిస్ట్ అజయ్‌కుమార్ మట్టెవాడ.. 18 క్యారెట్ల బంగారంతో ఒక చిన్న రాకెట్ ఆకృతిని తయారు చేసి.. అందులో ఈ ముగ్గురు సైంటిస్టుల విగ్రహాలను చెక్కారు. భారతదేశాన్ని అంతరిక్ష రంగంలో సూపర్ పవర్‌గా నిలిపిన ఆ ముగ్గురు మహానుభావుల గౌరవార్థం స్కైరూట్ ఈ వినూత్న ప్రయత్నం చేస్తోంది.

## స్కూలు వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు

**ఇద్దరు విద్యార్థులు సహా ఐదుగురు మృతి**



పశ్చిమబెంగాల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం ముర్షీదాబాద్‌లో పాఠశాల వ్యాన్‌ను ప్యాసింజర్ రైలు ఢీకొట్టిన దుర్ఘటనలో ఐదుగురు చనిపోగా అందులో ఇద్దరు విద్యార్థులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్ణసువర్ణ రైల్వే క్రాసింగ్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. తెరిచి ఉన్న రైల్వే క్రాసింగ్‌వద్ద వ్యాన్ పట్టాలు దాటుతుండగా.. నిమైతా-కటవా రైలు ఢీకొట్టింది. పట్టాలపై వ్యాన్ నుజ్జునుజ్జు అయిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తుచేసేందుకు 10మంది సభ్యుల బృందం ఘటనా స్థలానికి వెళ్లిందని తూర్పు రైల్వే అధికారులు వెల్లడించారు.ప్రమాద సమయంలో లెవల్ క్రాసింగ్ గేట్ తెరిచి ఉండటంతో.. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న గేట్ మ్యాన్, సూపర్‌వైజర్‌ను సస్పెండ్‌చేశారు. గేట్ మ్యాన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

# భారతీయ రైల్వేలో నూతన శకం

- పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు
- హర్యానాలోని జింద్ స్టేషన్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ



గల్ఫ్ సంక్షోభాన్ని తమ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని పశ్చిమాసియా ఉద్రిక్తతలను ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 2014కు ముందు ఈ పరిస్థితి వచ్చి ఉంటే.. దేశ రైల్వే వ్యవస్థ కుప్పకూలి ఉండేదన్నారు.అప్పట్లో చాలావరకు రైళ్లు డీజిల్‌తోనే నడిచేవని పేర్కొన్నారు. శుక్రవారం హర్యానాలోని జింద్ రైల్వేస్టేషన్లో దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్లో ఇంధన నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. చమురు దిగుమతులపైనే ప్రధానంగా ఆధారపడిన భారత్లోలో ఆ ప్రభావం కనిపిస్తోంది.ఈ నేపథ్యంలో దేశంలో హైడ్రోజన్ రైలు ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

2036లోనే భారత్లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించాలనుకుంటున్నట్లు ప్రధాని ఆకాంక్ష వ్యక్తం చేశారు.దానికి ముందు 2030లో కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు దేశం సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### రైల్వేలో నూతన శకం

భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైంది. రైల్వేరంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగుపడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపట్ సెక్షన్లో నడుస్తుంది. 89కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈరైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-సిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పట్టాల పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి.ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్ అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశ పెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ,చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమోలేక పరిమితంగా విని యోగంలోకి తీసుకురావడమో చేస్తున్నాయి.

ఈ రైలు ప్రత్యేకతలు: 10 బోగీలతో కూడిన హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలు, 1,200 కిలోవాట్ల సామర్థ్యమున్న హైడ్రోజన్ ప్రొఫల్షన్ వ్యవస్థ, గరిష్ఠంగా గంటకు 75కిలోమీటర్ల వేగంతో నడిచే సామర్థ్యం, ఒకేసారి సుమారు 2,600 మంది వరకు ప్రయాణించే వెసులుబాటు.

### ఓటరు జాబితానుంచి తొలగిస్తే..

# పౌరసత్వం పోయినట్లు కాదు

## - సుప్రీంకోర్టు స్పష్టీకరణ



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్, సర్)కు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం కోల్పోయినట్లు కాదని వ్యాఖ్యానించింది. అంతేకాదు.. ఈ జాబితా నుంచి తొలగించిన వ్యక్తులకు సంక్షేమ పథకాలను నిరాకరించవచ్చా? లేదా? అన్న విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో సర్‌పై వచ్చిన అభ్యంతరాలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఈమేరకు ఎన్నికల సంఘంతోపాటు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

సర్ ప్రక్రియలో భాగంగా ఓటరుజాబితాలో తమ పేరు కోల్పోయినవారి అప్పీళ్లను ప్రత్యేక ట్రైబ్యునళ్లు పరిష్కరిస్తున్నాయి. ఈక్రమంలో తిరస్కరణకు గురైన వ్యక్తులకు సంక్షేమపథకాలు నిరాకరించకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ అనే వ్యక్తి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటరు జాబితాలో పేరు తొలగించిన వెంటనే.. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), అన్నపూర్ణతోపాటు ఆర్థిక సాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సంబంధిత వ్యక్తికి అందకుండా బెంగాల్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. దాదాపు 34లక్షల అప్పీళ్లు ట్రైబ్యునళ్ల ముందు పెండింగు దశలోనే ఉన్నాయని.. ఇప్పటి వరకు కేవలం 38వేల అప్పీళ్లకు మాత్రమే పరిష్కారం లభించిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం..దీనిపై ఇప్పటికే(బీహార్ 'సర్' విషయంలో) స్పష్టత ఇచ్చామని పేర్కొంది. ఎన్నికల సంఘానికి కేవలం ఓటరు జాబితా, పర్యవేక్షణ అధికారం మాత్రమే ఉందని, పౌరసత్వాన్ని నిర్ణయించలేదని మరోసారి స్పష్టం చేసింది. పౌరసత్వంపై అనుమానంతో ఎవరినైనా ఓటరును జాబితా నుంచి తొలగిస్తే..వారిపౌరసత్వ హోదాను నిర్ధారించుకునేందుకు ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉంటుందని తెలిపింది. 'సర్'పర్యవసానాలపై దాఖలైన ఈపిటిషన్‌ను జులై 25కు ముందే లిస్టు చేస్తామని పేర్కొంది.

# ఆత్మగానైనా తిరిగొస్తా..

నీట్ సహా, ఇతర ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న నిరాహార దీక్ష శుక్రవారానికి 20వ రోజుకు చేరింది. వాంగ్‌చుక్ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్ వరకూ తాను ప్రాణాలతోనే ఉంటానని చెప్పారు. ఒక వేళ అది సాధ్యం కాకపోతే.. ఆత్మగా అయినా తిరిగొస్తానని వ్యాఖ్యానించారు.తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా.. అంతర్గతంగా బలంగా ఉన్నానని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. పార్లమెంట్ మార్చ్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేతలకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆరోజున ప్రజలందరితో కలిసి పార్లమెంట్‌కు మన విన్నపాన్ని సమర్పిద్దామన్నారు.

ఆరోగ్యం క్షీణిస్తుండడంతో దీక్షను విరమించాలని వైద్యులు హెచ్చరించినప్పటికీ.. ఆయన కొనసాగించేందుకే నిర్ణయించుకున్నారు. దీంతో ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుని ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది.



# నాపై చైనా కుట్ర

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో తనను ఓడించేందుకు డ్రాగన్ పెద్ద ఎత్తున కుట్ర పన్నిందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఎన్నడూ లేని విధంగా అమెరికాకు చెందిన భారీ డేటా చోరీకి చైనా పాల్పడిందని ఆరోపించారు. వైట్‌హౌస్ నుంచి దేశ ప్రజలనుద్దేశించి దాదాపు 25 నిమిషాల పాటు మాట్లాడిన ట్రంప్.. యూఎస్ ఇంటెలిజెన్స్ అసెస్ మెంట్ నివేదికలు ఈ విషయాలను బహిర్గతం చేస్తున్నాయని స్పష్టం చేశారు. 2020లో ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక దాదాపు 22 కోట్ల మంది అమెరికా ఓటర్ల వివరాలను దొంగిలించారని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### మా ఎన్నికల వ్యవస్థ బలహీనంగా ఉంది

అమెరికా ఎన్నికల ప్రక్రియకు చైనా వల్ల తీవ్ర ముప్పు పొంచి ఉందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికాలో డెమొక్రాట్లు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో విదేశీయులు అక్రమంగా ఓటర్లుగా రిజిస్టర్ అయ్యారు. మా ఓటర్ల జాబితా ప్రస్తుతం విదేశీ ప్రభుత్వాల చేతుల్లో ఉంది. ఒక్క చైనా మాత్రమే కాకుండా రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు నిఘా సమాచారం అందింది" అని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ఓటింగ్ యంత్రాలు, బ్యాలెట్ కౌంటింగ్ తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని, కనీసం ఓటర్ ఐడీ, పౌరసత్వ నిరూపణ పత్రాలు లేకుండానే ఓట్లు వేస్తున్నారని మండిపడ్డారు. తపాలా (మెయిల్-ఇన్ బ్యాలెట్) ద్వారా కోట్ల మంది అక్రమంగా ఓటింగ్‌లో పాల్గొంటున్నారని, భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా ఎన్నికల సంస్కరణలు అవసరమని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని ట్రంప్ స్పష్టం చేశారు.

### ట్రంప్ ఆరోపణలకు చైనా కౌంటర్..

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించింది. అమెరికా ఎన్నికల్లో తాము ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని, భవిష్యత్తులోనూ చేసుకోబోమని చైనా దౌత్య కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. "ఇతరుల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదనే ప్రాథమిక సూత్రానికి చైనా మొదటి నుంచి కట్టుబడి ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు అనేది పూర్తిగా ఆ దేశ అంతర్గత విషయం. వాటి ఫలితాన్ని ఆ దేశ ఓటర్లే నిర్ణయించుకుంటారు" అని చైనా స్పష్టం చేసింది.

# ఉమ్మడిగా 'ఏఐ' అభివృద్ధి

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

ప్రస్తుత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో అత్యంత వేగంగా దూసుకుపోతున్న కృత్రిమ మేధ అభివృద్ధిపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ సాంకేతికతను ఏ ఒక్క దేశమో విడివిడిగా అభివృద్ధి చేయడం కంటే ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా అభివృద్ధి చేస్తే మరింత ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. షాంఘైలో ఘనంగా నిర్వహించిన 'ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు-2026' ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. ఏఐ అద్భుత వేగంతో దూసుకుపోతున్న తరుణంలో దానిని పూర్తిగా మానవాళి శ్రేయస్సు కోసమే ఉపయోగపడేలా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.



ఏఐ సాంకేతికత పెరిగేకొద్దీ దానివల్ల తలెత్తే కొత్త సమస్యలకు, సవాళ్లకు మనం కచ్చితంగా సమాధానాలు వెతకాల్సిన అవసరముందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. "ఆలోచనా జ్ఞానం ఉన్న యంత్రాలతో (ఇంటెలిజెంట్ మెషీన్స్) మనం ఎలా కలిసిపోవాలి? అల్గారిథమ్‌లలో నిర్ణయాధికారం భాగమైనప్పుడు దానికి ఎలాంటి భద్రత కల్పించాలి? మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికత వల్ల ఎదురయ్యే విభిన్న సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి? అందరికీ ఏఐ అందుబాటులోకి తీసుకురావడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి?" వంటి కీలక ప్రశ్నలపై ప్రపంచ దేశాలన్నీ ఒకే తాటిపైకి వచ్చి ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని దేశాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఏఐని అభివృద్ధి చేయడమే చైనా లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ఏఐ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు.. ఆసియాన్, అరబ్ లీగ్, ది షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్, ది ఆఫ్రికన్ యూనియన్, లాటిన్ అమెరికా, బ్రిక్స్ దేశాలకు చైనా పూర్తి సహకారం అందిస్తుందని జిన్‌పింగ్ హామీ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడంలో భాగంగా రాబోయే రోజుల్లో ఈ దేశాల కోసం సుమారు 5వేల మంది ఏఐ నిపుణులతో (రీసెర్చ్ ప్రాజెక్టులతో) పాటు విభిన్న శిక్షణ, సెమినార్ కార్యక్రమాలను నిర్వహించేందుకు చైనా సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు.



## యూరప్‌లో వేడిగాలులు

# 12వేల మంది మృతి!

శీతల ఖండం యూరప్‌లో వేడిగాలులు ప్రజల్లో వణుకు పుట్టిస్తున్నాయి. హీట్ డోమ్‌తో పలు దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రచండ వేడి గాలులను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. అనేక దేశాల్లో ప్రమాదకర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణో గ్రతలు పెరుగుతుండటంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఒక్క జూన్‌లో సంభవించిన వేడిగాలులతోనే 9 యూరోపియన్ దేశాల్లో కనీసం 12వేల మంది చనిపోయినట్టు పలుగణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు హీట్ వేవ్‌కు తీవ్రంగా ప్రభావితమ య్యాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు మరింత తీవ్ర మవ్వడంతో దాదాపు 85% మంది 65 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు మృతి చెందారని పలు ఆరోగ్య సంస్థలు వెల్లడించాయి. ఈ మరణాలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తీవ్రమైన వడగాడ్పులు అంతటా విస్తరిస్తుండడంతో యూరప్‌లోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు అనేక దేశాల్లో జనజీవనం, ప్రజారోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇవి మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, వీటిని సరిచేయలేకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్‌కు చెందిన వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# విదేశీ విద్యార్థులకు నాలుగేళ్లే గడువు

## పరిమితి విధించనున్న ట్రంప్ సర్కార్




వాషింగ్టన్: అమెరికాలో 3.3 లక్షల మందికిపైగా భారతీయులు సహా అంతర్జాతీయ విద్యార్థులు త్వరలో కఠినమైన వలస నిబంధనలను ఎదుర్కొనే అవకాశం ఉంది. దీర్ఘకాలంగా అమల్లో ఉన్న డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ విధానాన్ని తొలగించి దాని స్థానంలో నిర్ణీత కాల నివాసాన్ని ప్రవేశపెట్టే నిబంధనను అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ఖరారు చేసిన నేపథ్యంలో కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి. కొత్త నిబంధన కింద ఎఫ్-1 వీసాలపై ఉన్న విద్యార్థులను సాధారణంగా అమెరికాలో గరిష్ఠంగా నాలుగేళ్లు ఉండేందుకు అనుమతిస్తారు. తమ చదువులను పూర్తి చేయడానికి అదనపు సమయం అవసరమైన వారు తమకు అనుమతించిన బస గడువు ముగిసేలోపు డీహెచ్‌ఎస్ నుంచి గడువు పొడిగింపును పొందాల్సి ఉంటుంది. ఈ నిబంధన జే-1 ఎక్స్ఛేంజ్ విజిటర్లు, విదేశీ మీడియా ప్రతినిధులకు జారీ చేసే 1-వీసాదారుల బస కాలపరిమితిని కూడా నిర్దేశిస్తుంది. ఇది అమల్లోకి రావడానికి ముందు కాంగ్రెస్ పరిశీలన పొందాల్సి ఉంటుంది. వీసా వ్యవస్థపై పర్యవేక్షణను బలోపేతం చేయడం, జాతీయ భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరించడమే ఈ మార్పుల లక్ష్యమని ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. అయితే నాలుగేళ్లకు మించి విద్యా కార్యక్రమాలు కొనసాగించే వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థులకు ఈ నిబంధన అనిశ్చితి సృష్టించవచ్చని విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు హెచ్చరించాయి. అమెరికాలో ప్రస్తుతం అతిపెద్ద అంతర్జాతీయ విద్యార్థుల సమూహంగా ఉన్న భారతీయ విద్యార్థులపై ఈ నిబంధన గణనీయమైన ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

## లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హామ్

# త్వరలో బ్రిటన్ ప్రధాని!

లండన్: బ్రిటన్‌లోని లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హామ్ కన్ఫర్మ్ అయ్యారు. తన నాయకత్వంలో పార్టీని నడిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ప్రధాని కీర్ స్టార్మర్ ఆశయాలకు తగినట్లు పార్టీని నిర్మిస్తానని చెప్పారు. పార్టీ నేతగా స్టార్మర్ ఉన్న సమయంలో.. ఓటమి దశ నుంచి పార్టీ అద్భుత విజయాన్ని నమోదు చేసిందని, లేబర్ పార్టీ ఇప్పుడు ప్రజల జీవితాలను మార్చేస్తోందన్నారు. వచ్చే వారం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ప్రధాని బాధ్యతలు ఆండీ బర్న్‌హామ్ స్వీకరించే అవకాశాలున్నాయి. లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హామ్ నియమితుడైన విషయాన్ని ఆ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మెన్ షాబానా మహమూద్ ప్రకటించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఆండీ బర్న్‌హామ్‌ను మూడవ కింగ్ చార్లెస్ సోమవారం ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయి. కీర్ స్టార్మర్ తన రాజీనామా సమర్పించిన తర్వాత ఈ ప్రక్రియ జరుగుతుంది.



# బాలిస్టిక్ క్షిపణులతో దాడి

## అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసం

టెహ్రాన్: ఇరాన్ భారీ దాడి చేసింది. అమెరికాకు చెందిన మిలిటరీ విమానాలను ధ్వంసం చేసింది. జోర్డాన్‌లో ఉన్న అమెరికా బేస్‌పై అటాక్ జరిగింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. గత రాత్రి జరిగిన దాడులకు ప్రతీకారంగా అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడినట్టు తెలుస్తోంది. ఆ దాడుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌కు చెందిన సుమారు మూడు క్షిపణులను కూల్చేశామని జోర్డాన్ మిలిటరీ వెల్లడించింది.




తాజాగా జరిగిన దాడి గురించి ఇరాన్స్ రెవల్యూష నరీ గార్డ్స్ ఓప్రకటన చేసింది. అమెరికా వైమానిక దళానికి చెందిన అనేక రీఫ్యూయలింగ్ విమానాలు, యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్టు ఐఆర్జీసీ తెలిపింది. సిరియాలో ఉన్న అల్ తానఫ్ అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్‌ను కూడా అటాక్ చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది.

వరుసగా ఆరో రోజు గురువారం రాత్రి అమెరికా వైమానిక దాడులు చేసింది. ఇరాన్ మౌలిక సదుపాయాలను టార్గెట్ చేసింది. ఆ దేశంలో ఉన్న అనేక బ్రిడ్జిలను నేలమట్టం చేసింది. అయితే ఈ దశలో ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. ఒకవేళ దాడులు ఉధృతమైతే అప్పుడు యావత్ పశ్చిమాసియా ప్రాంతం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. హర్మోజ్‌గన్ ప్రావిన్సులో జరిగిన దాడుల్లో ఐదు వంతెనలను అమెరికా విమాన సిబ్బంది పేల్చేసింది. కీలకమైన బందర్ అబ్బాస్ పోర్టు నగరానికి లింకున్న బ్రిడ్జిలను కూల్చివేసినట్టు తెలుస్తోంది.

బహ్రెయిన్‌లోని సాకిర్ ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా హెలికాప్టర్లు, రికనయిసెన్స్ విమానాలను ధ్వంసం చేసినట్టు ఇరాన్ చెప్తోంది. మరోవైపు అలారం సైరన్లు మోగించినట్టు బహ్రెయిన్ మంత్రి పేర్కొన్నారు. ప్రజలు సంయమనంతో ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. కానీ ఎయిర్‌బేస్ మీద అటాక్ జరిగినట్టు అమెరికా, బహ్రెయిన్ అధికారులు ఇంకా కన్ఫర్మ్ చేయలేదు.

# మహిళల హాకీ ప్రపంచ కప్ 2026



### భారత జట్టు ప్రకటన

ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 కోసం భారత జట్టును హాకీ ఇండియా ప్రకటించింది. నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీలో భారత జట్టుకు సలీమా టెటే కెప్టెన్‌గా వ్యవహరించనుంది. మొత్తం 20 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రధాన కోచ్ స్జోర్డ్ మారైన్ ఎంపిక చేశారు. ఆగస్టు 15 నుంచి 30 వరకు జరిగే ప్రపంచ కప్‌కు ముందు బెంగళూరులో జాతీయ శిక్షణ శిబిరంలో భారత జట్టు కసరత్తులు చేస్తోంది. ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో ఓటమి లేకుండా టైటిల్ గెలిచిన ఆటగాళ్లకు ఈ జట్టులో ప్రాధాన్యం లభించింది.

ప్రపంచ కప్‌లో భారత్ పూల్-డిలో చోటు దక్కించుకుంది. ఈ గ్రూప్‌లో చైనా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి. నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్‌వీన్‌లో ఉన్న వాగెనర్ హాకీ స్టేడియంలో భారత్ తన లీగ్ మ్యాచ్‌లన్నింటినీ ఆడనుంది. ఆగస్టు 16న చైనా, ఆగస్టు 18న దక్షిణాఫ్రికా, ఆగస్టు 20న ఇంగ్లండ్ జట్లతో భారత్ తలపడనుంది.

గోల్‌కీపర్లు: సవిత, బిచు దేవి ఖరిబామ్
డిఫెండర్లు: ఇషికా చౌదరి, సుశీలా చాను, లాల్తంత్లువాంగి, జ్యోతి, శిల్పి దబాస్
మిడ్ ఫీల్డర్లు: సలీమా టెటే (కెప్టెన్), నిక్కీ ప్రధాన్, సాక్షి రాణా, సునెలితా టొప్పో, నేహా, దీపికా సోరెంగ్
ఫార్వర్డ్స్: లాల్‌రెమ్సియామి, రుతుజా దాదాసో పిసాల్, నవ్‌నీత్ కౌర్, దీపిక, ఇషికా, బల్జీత్ కౌర్, బ్యూటీ దుంగ్‌దుంగ్

# జపాన్ ఓపెన్ టోర్నీ: సెమీస్‌కు సింధు

జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. టోక్యోలో శుక్రవారం జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు జపాన్‌కు చెందిన నొజోమీ ఒకుహారా గాయం కారణంగా వైదొలిగింది. దీంతో ఎలాంటి పోటీ లేకుండానే సింధు సెమీ ఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. ఈ సీజన్‌లో తొలి టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగిన ఆమె.. సెమీస్‌లో చైనా ప్రపంచ నాలుగో ర్యాంకర్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత చెన్ యూఫీతో తలపడనుంది. ఈ సీజన్లో సింధుకు ఇది మూడో సెమీఫైనల్. సింధు-చెన్ యూఫీ మధ్య ఇప్పటిదాకా 14 మ్యాచ్‌లు జరగగా.. చెన్ 8-6 ఆధిక్యంలో ఉంది. ముఖ్యంగా గత ఐదు వరుస మ్యాచ్‌ల్లో సింధు ఓటమిపాలైంది. ఈసారి విజయం సాధిస్తే ఆ పరాజయాల పరంపరకు తెరపడటమే కాకుండా దాదాపు మూడేళ్ల తర్వాత సూపర్-750 టోర్నీ ఫైనల్‌లోకి అడుగుపెట్టిన ఘనతను సొంతం చేసుకోనుంది.



# ఫుట్‌బాల్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌కు డొనాల్డ్ ట్రంప్



ఫుట్‌బాల్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అభిమానులు ఎంతగానో వేచి చూస్తున్నారు. స్పెయిన్, అర్జెంటీనా మధ్య న్యూజెర్సీలోని యార్క్ స్టేడియంలో ఆదివారం జరిగే తుది పోరును వీక్షించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే మ్యాచ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కానుండటం విశేషం. ఈ విషయాన్ని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ధ్రువీకరించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి విజేతకు కప్ అందజేసే అవకాశం ఉందని ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్ఫాంటినో ఇటీవల వెల్లడించారు.
ఇదిలా ఉండగా 1978, 1996, 2022లో ప్రపంచకప్ గెలిచిన అర్జెంటీనా.. మరోసారి కప్పుపై కన్నేసింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్‌పై దూకుడుగా ఆడి విజయం సాధించింది. కప్‌ను కైవసం చేసుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది. 1990, 1990, 2014ల్లోనూ అర్జెంటీనా రన్నరప్‌గా నిలిచింది. 1906లో కప్పు గెలిచిన ఇంగ్లాండ్.. ఆ తర్వాత ఎప్పుడూ ఫైనల్‌కు చేరలేదు. ఈసారి సెమీ ఫైనల్‌కు వచ్చినప్పటికీ అర్జెంటీనా జట్టు దూకుడును తట్టుకోలేక ఓడిపోయింది. మరోవైపు సమష్టి కృషితో స్పెయిన్ ఫైనల్‌కి చేరుకుంది. సెమీస్లో బలమైన ప్రత్యర్థి ఫ్రాన్స్‌ని ఓడించి అర్జెంటీనాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది.

# 'ఫిఫా' ఫైనల్‌కు రిఫరీగా విన్సిచ్




### అర్జెంటీనాకు టెన్షన్

ఫిఫా ప్రపంచ కప్ 2026 ఫైనల్‌కు స్లోవేనియాకు చెందిన స్లావ్కో విన్సిచ్ ప్రధాన రిఫరీగా ఎంపికయ్యారు. ఆదివారం అర్జెంటీనా-స్పెయిన్ మధ్య జరగనున్న టైటిల్ పోరుకు ఆయన రిఫరీగా ఉంటారని ఫిఫా ప్రకటించింది. ఆయనతో పాటు టోమాజ్ క్లాంక్నిక్, ఆండ్రాజ్ కోవాసిక్ అసిస్టెంట్ రిఫరీలుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. అయితే ఇప్పుడు అర్జెంటీనాను ఓ సెంటిమెంట్ కలవరపెడుతోంది. విన్సిచ్ రిఫరీగా ఉన్న మ్యాచ్‌లో అర్జెంటీనా ఓటమి పాలైంది. ఈ ప్రపంచ కప్‌లో నిర్వాహకులు, రిఫరీలు అర్జెంటీనాకే అనుకూలంగా ఉన్నారనే విమర్శలు వస్తోన్న నేపథ్యంలో ఫిఫా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఫైనల్ మ్యాచ్‌కు ముందు రిఫరీ కిట్ అందుకున్న సమయంలో విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## లార్డ్స్‌కు రోహిత్ శర్మ తల్లిదండ్రులు ఎందుకంటే!

*భారత స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఊహాగానాలు కొనసాగుతున్న వేళ మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఆదివారం లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో చివరి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు రోహిత్ శర్మ తల్లిదండ్రులు గురునాథ్ శర్మ, పూర్ణిమ శర్మ లండన్ చేరుకున్నట్టు సమాచారం. దీంతో ఈ మ్యాచ్ రోహిత్ కెరీర్‌లో చివరి వన్డే కావచ్చనే ప్రచారం మరింత ఊపందుకుంది. రోహిత్ శర్మ తల్లిదండ్రులు లార్డ్స్ మైదానంలో ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై రోహిత్ కుటుంబం లేదా బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే వెలువడిన పలు మీడియా కథనాల ప్రకారం.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు అవకాశాలు ఇవ్వాలని భావిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో వన్డే జట్టులో రోహిత్ స్థానంపై అనిశ్చితి నెలకొంది. ఇంగ్లండ్‌తో తొలి రెండు వన్డేల్లో రోహిత్ 11, 26 పరుగులకే పరిమితమవడంతో విమర్శలు మరింత పెరిగాయి. అయితే రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో లార్డ్స్ వేదికగా జరిగే చివరి వన్డే అనంతరం ఈ సస్పెన్స్‌కు తెరపడే అవకాశముంది.*



## మెస్సీ ఎక్కడుంటే మోహన్‌లాల్ అక్కడే!

భారత్‌లో ఫుట్‌బాల్‌ను అభిమానించే వారిలో కోల్‌కతా, కేరళ వారే ఎక్కువగా ఉంటారు. మరీ ముఖ్యంగా అర్జెంటీనా అంటే కేరళవాసులకు బాగా ఇష్టం. డిగీ మారడోనా నుంచి ఇప్పుడు లియోనెల్ మెస్సీకి వీరాభిమానులు ఉన్నారు. ఆ జాబితాలో మలయాళం సూపర్‌స్టార్ మోహన్‌లాల్ కూడా ఒకరు. మెస్సీ అంటే ఎంతో ఇష్టమని పలు సందర్భాల్లో మోహన్‌లాల్ మనసులో మాట బయటపెట్టారు. తాజాగా మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు ప్రపంచ కప్‌లో దుమ్మురేపుతోంది. సెమీస్లో బలమైన ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. అట్లాంటాలో జరిగిన మ్యాచ్‌ను మోహన్‌లాల్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఆ ఫొటోలను సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సీ తన ఇన్‌స్టాలో పోస్టు చేశారు. మోహన్‌లాల్ వెంట నటుడు ఫహాద్ ఫాజిల్ కూడా ఉన్నారు.

ఇక అర్జెంటీనా-స్పెయిన్ జట్ల మధ్య న్యూజెర్సీలో జరిగే ఫైనల్ మ్యాచ్‌ను కూడా మోహన్‌లాల్ ప్రత్యక్షంగా వీక్షించడం ఖాయం. ఎందుకంటే ఇప్పుడే కాదు.. గతంలోనూ అర్జెంటీనా మ్యాచ్ ఎక్కడ జరిగితే అక్కడికి వెళ్లేవారు.

చైతన్య రథం
# సినిమా
శనివారం 18 జూలై 2026 X


### ‘మహాప్రభు జగన్నాథ్’ విడుదలకు
## సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్
**ఈ నెల 28 లేదా ఆ తర్వాత థియేటర్లలో ప్రదర్శనకు అనుమతి**



పూరి జగన్నాథుడి పవిత్ర కథ ఆధారంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన యానిమేషన్ చిత్రం ‘మహాప్రభు జగన్నాథ్’ విడుదలకు ఎదురైన లీగల్ అడ్డంకులు తొలగి పోయాయి. ఈ సినిమా ప్రదర్శనపై ఒడిశా హైకోర్టు విధించిన స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ప్రస్తుతం ఒడిశాలో జరుగుతున్న సంప్రదాయ రథయాత్ర పూర్తయిన తర్వాతే ఈ సినిమాను థియేటర్లలో ప్రదర్శించాలని స్పష్టంచేస్తూ... ఈ 28లేదా ఆ తర్వాత చిత్రాన్ని విడుదల చేసుకోవచ్చని సర్వోన్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపింది.

**భక్తుల మనోభావాలు దెబ్బతినవు: సుప్రీంకోర్టు**

సినిమా విడుదల వల్ల భగవంతుని పై భక్తులకు ఉన్న అచంచలమైన భక్తిశ్రద్ధలు ఏమాత్రం తగ్గిపోవని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటికే ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి క్లీన్ ‘యూ’ సర్టిఫికెట్ లభించిన విషయాన్ని కూడా న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పుపై చిత్ర యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. ఎంతో భక్తిశ్రద్ధలతో, కష్టపడి ఈ యానిమేషన్ చిత్రాన్ని నిర్మించామన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం జూలై 28న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని నిర్మాతలు ప్రకటించారు.

### స్నేహితుల సర్‌ప్రైజ్‌తో
## సమంత సీమంతం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తోంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు.

ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావుడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్టు సమాచారం.



ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరినీ ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అభిమానులు కూడా తల్లి కాబోతున్న సమంతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు.

## ‘3 ఇడియట్స్’ రాంచో పాత్ర సోనమ్ వాంగ్‌చుక్‌ది కాదు
**ఏళ్ల నాటి రూమర్‌పై అమీర్ ఖాన్ క్లారిటీ**



బాలీవుడ్ స్టార్ హీరో ఆమీర్‌ఖాన్ తాజాగా ‘3 ఇడియట్స్’ సినిమాపై ఎన్నాళ్లుగానో ప్రచారంలో ఉన్న అపోహకు తెరదించారు. ఆ సినిమాలో ఆయన పోషించిన ‘రాంచో’ పాత్రను లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆమిర్ ఖాన్... తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన ‘లగాన్’ చిత్రం 25 ఏళ్ల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రేక్షకులతో ముచ్చటించారు.

ఈ సందర్భంగా ‘3 ఇడియట్స్’ సినిమాలోని రాంచో పాత్ర, సోనమ్ వాంగ్‌చుక్ మధ్య ఉన్న సంబంధంపై ప్రశ్నలు ఎదురవగా... ఆమిర్ పూర్తి వివరణ ఇచ్చారు.

రాంచో పాత్రను సోనమ్ వాంగ్‌చుక్‌ను దృష్టిలో పెట్టుకుని రాశారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆమిర్ స్పష్టం చేశారు. ‘3 ఇడియట్స్’ సినిమా రూపొందించే సమయంలో మాకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి అసలు తెలియదు. ఆ పాత్రకు ఆయన జీవితానికి ఎలాంటి సంబంధం లేదు. అది కేవలం సంవత్సరాలుగా కొనసాగుతున్న ఒక అపోహ మాత్రమే అన్నారు. ఇటీవల సినిమాలో ‘చతుర్ రామలింగం’ పాత్ర పోషించిన నటుడు ఓమి వైద్య చేసిన వ్యాఖ్యలను కూడా ఆమిర్ ప్రస్తావించారు. ఓమి చెప్పిన వీడియో నేను కూడా చూశాను. కానీ అది సరైన సమాచారం కాదు. బహుశా అతను అలా భావించి ఉండొచ్చు. కథ రచయితలు రాజ్‌కుమార్ హిరాణీ, అభిజాత్ జోషి, నేను... ఎవరికీ ఆ సమయంలో సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదు అని స్పష్టం చేశారు.

సినిమా పాత్రకు సంబంధం లేకపోయినా, సమాజం కోసం సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని ఆమిర్ కొనియాడారు. ఆయన చేస్తున్న మంచి పనులకు గౌరవం ఇవ్వడానికి ‘3 ఇడియట్స్’తో సంబంధం ఉండాల్సిన అవసరం లేదు. ఆయన సేవలు స్వతంత్రంగా ఎంతో విలువైనవి అని అన్నారు. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షపై ఆమిర్ స్పందించారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం ఆయన చేస్తున్న నిరసనపై ఆందోళన వ్యక్తం చేస్తూ... ఆయన ఆరోగ్యం గురించి మేమంతా ఆందోళన చెందుతున్నాం. ఆయన త్వరగా కోలుకుని, ఈ దీక్షను శాంతియుతంగా ముగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమానికి ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు మద్దతు ప్రకటించారు.

## ‘రాకా’ కోసం...
## ప్రెగ్నెన్సీతోనే దీపిక యాక్షన్

వృత్తిపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వస్తున్న ‘రాకా’లో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా కోసం ప్రెగ్నెన్సీతోనే ఆమె కఠినమైన యాక్షన్ సన్నివేశాలు షూట్ చేశారని సమాచారం. గతంలో ‘ఎనిమిది గంటల పని’ నిబంధన తెరపైకి తీసుకొచ్చిన దీపికా.. ‘రాకా’ కోసం మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా పని చేసినట్లు తెలుస్తోంది. ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందే, ‘రాకా’లో తన షూటింగ్ను పూర్తి చేయాలని నిర్ణయిం చుకున్నట్లు సమాచారం. అటు షూటింగ్లో పాల్గొంటూనే తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటున్నారు. దీపిక లైఫ్‌ను ఇలా బ్యాలెన్స్ చేస్తుండ దంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది. అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా పదుకొణె తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటుండ టంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.



### హీరోగా అప్పుడే కాదు
## క్లారిటీ ఇచ్చిన స్టార్ కిడ్ జాసన్

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ‘సిగ్మా’ అనే చిత్రంతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. అయితే హీరోగానూ వెండితెరపై మెరవబోతున్నాడంటూ గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ వార్తలపై తాజాగా జాసన్ సంజయ్ స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. “నేను సినిమా రంగంలోకి రావాలనుకున్నప్పుడు మా ఇంట్లో వాళ్లు ఎంతో సానుకూలంగా స్పందించారు. వారి ప్రోత్సాహమే నాకు కొండంత బలాన్ని ఇచ్చింది. ‘సిగ్మా’ సినిమా ప్రారంభోత్సవ సమయంలో విజయ్ సేతుపతితో పాటు ఎంతోమంది సినీ ప్రముఖులు నన్ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే ఉత్సాహంతో ఇప్పుడు ముందుకు సాగుతున్నాను” అని తెలిపారు.

గతంలో తనకు వచ్చిన ఒక నటన (యాక్టింగ్) ఆఫర్ గురించి ప్రస్తావిస్తూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. “ఆ సమయంలో నేను కెనడాలో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ నేర్చుకుంటున్నాను. నాకు వచ్చిన ఆఫర్ కంటే, ఆ పాత్రకు బాగా సరిపోయే మరొకరిని ఎంచుకోవాలని ఆ దర్శకునికి సూచించాను. అయితే ‘సిగ్మా’ సినిమా సెట్స్‌లో దర్శకుడిగా నటీనటులకు సీన్స్ వివరించేటప్పుడు.. నాలోనూ ఓ నటుడు ఉన్నాడని నాకే అనిపించింది” అని సంజయ్ పేర్కొన్నారు.

హీరోగా ఎంట్రీ ఇవ్వడంపై తన మనసులోని మాటను బయటపెడుతూ.. “ప్రస్తుతానికి నా శ్రద్ధ, ఏకాగ్రత మొత్తం ‘సిగ్మా’ సినిమా పైనే ఉంది. ఈ సినిమా విడుదలైన తర్వాతే నేను నటన వైపు వెళ్లాలా? లేదా దర్శకుడిగానే కొనసాగాలా? అనే విషయాలపై ప్రశాంతంగా ఆలోచిస్తాను” అని సంజయ్ స్పష్టం చేశారు. దీంతో ఆయన హీరో ఎంట్రీపై వస్తున్న వార్తలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.



## ‘పుష్ప 3’ మరింత ఆలస్యం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో అత్యంత బిజీ హీరోల్లో ఒకరిగా కొనసాగుతున్నారు. ‘పుష్ప’ సిరీస్‌తో దేశవ్యాప్తంగా అపారమైన క్రేజ్ సంపాదించుకున్న బన్నీ ఇప్పుడు వరుసగా భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. అయితే ఆయన కొత్త లైనప్ చూసిన అభిమానుల్లో ఒకవైపు ఉత్సాహం కనిపిస్తుండగా... మరోవైపు ‘పుష్ప 3’ భవితవ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ తమిళ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీ ‘రాకా’ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. భారీ వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా ఈ సినిమా విడుదల 2027 చివర్లో లేదా 2028కి వెళ్లే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి.

